ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రత గురువారం గరిష్ఠం : 29.0 కనిష్ఠం : 24.0

ANDHRAJYOTHY 5



శ్రీ సత్యసాయి జిల్లా వార్తలు

శుక్రవారం 13 జూన్ 2025



పుట్టపర్తిలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి



కదిరిలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కందికుంట



హిందూపురంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద సంబరాలు

ఊరూరా సంబరాలు

పుట్టపర్తిరూరల్/కదిరి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): కూటమి పాలన ఏడాది సంబరాలను గురువారం ఊరూరా ఘనంగా నిర్వహించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కేక్ కట్ చేసి, ఆనందం పంచుకున్నారు. పుట్టపర్తిలోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి.. శ్రేణులతో కలిసి కేక్ కట్ చేసి, సంబరాలు చేసుకున్నారు. కదిరిలోని ఆర్ అండ్‌బీ బంగ్లాలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, పంచి పెట్టారు. కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరామర్శ.. పన్నాగం..!

అరాచకానికి వైసీపీ కుట్ర..!

పేరూరులో బల ప్రదర్శనకు ఎత్తుగడ

భద్రతావైఫల్యంగా చిత్రీకరించే ప్రయత్నం

పోలీసులపై మేరుగ రుసరుస

బాధితురాలు ఆసుపత్రిలో ఉంటే..

'చలో పేరూరు' ఎందుకో..?



వైసీపీ నేతలను అడ్డుకున్న పోలీసులు

పుట్టపర్తి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రతి విషయంలోనూ అల్లర్లు, అరాచకానికి కుట్ర పన్నుతోంది. బాలికపై అత్యాచారం విషయంలోనూ ఇదే పన్నాగం పన్నిందన్న వాదనలు వినిపిస్తున్నాయి. కుంటిమద్ది హెలీకాప్టర్ ఘటన మరువక మునుపే రాప్తాడు నియోజకవర్గంలో వైసీపీ మరోమారు పరామర్శల పేరుతో రాజకీయ కుట్రకు తెరలేపింది. బాలిక అత్యాచారం ఘటనలో ప్రమేయం ఉన్న నిందుతులను పోలీసులు అరెస్టు చేసినా 'చలో పేరూరు' అంటూ వైసీపీ శ్రేణులు గురువారం బల ప్రదర్శన ప్రయత్నం చేశాయి. ఇటీవల రామగిరి మండలంలోని ఓ గ్రామంలో బాలికపై అత్యాచారాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించింది. ఆ మేరకు అత్యాచారం కేసులో ప్రమేయం ఉన్న 13 మందిని పోలీసులు అరెస్టు చేశారు. సున్నితమైన ఈ ఘటన విషయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించినా వైసీపీ నాయకులు రాజకీయ

(మిగతా 7వ పేజీలో...)

తాగునీటి సరఫరాకు చర్యలు

ఆర్.యర్రగుంటపల్లిలో సమస్య పరిష్కారం



సత్యసాయి పైపులైన్ మరమ్మతులు చేయిస్తున్న అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ధర్మవరంరూరల్, జూన్12(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్.యర్రగుంటపల్లి గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకున్నారు. గుక్కెడు నీటి కోసం అవస్థలు శీర్షికన గురువారం 'ఆంధ్రజ్యోతి'లో ఓ కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన జిల్లా పంచాయతీ అధికారులు తాగునీటి సమస్య తీర్చాలని ఆదేశించారు. ఎంపీడీఓ సాయిమనోహర్ ఆదేశాల మేరకు గ్రామపంచాయితీ అధికారులు పైపులైన్ మరమ్మతులు చేయించి సత్యసాయి నీటిని సరఫరా చేయించారు. త్వరలోనే గ్రామంలో బోరువేయించి శాశ్వతంగా తాగునీటి సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. దీంతో ఆ గ్రామప్రజలు 'ఆంధ్రజ్యోతి'కి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలిపారు.



సాగుచేసిన మొక్కజొన్న పంట

మద్దతు ధరలతో ఊరట

ఖరీఫ్ నుంచి కొత్త ధరలు

- మొక్కజొన్న క్వింటాలుకు రూ. 2,400
- కందులకు రూ. 8వేలు
- రాగికి రూ. 4,886
- వేరుశనగకు రూ.7,263
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

చిలమత్తూరు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): పండించిన పంటకు సరైన ధరలు లభించక నష్టాలకు గురవుతున్న రైతులకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. ప్రధానంగా మొక్కజొన్న, కంది, రాగి, వేరుశనగ పంటలకు మద్దతు ధరలను పెంచుతూ తీసుకున్న నిర్ణయంపై రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. పెట్టుబడులు పెట్టి పంట చేతికందిన తరువాత గిట్టుబాటు లేక దళారుల చేతుల్లో మోసపోతున్న రైతులకు పెంచిన ప్రభుత్వ మద్దతు ధరలు ఎంతో లాభదాయకంగా ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వంలో గిట్టుబాటు ధరలు లేక, పండిన పంటను సరైన ధరలకు అమ్ముకోలేక నానా ఇబ్బందులు పడ్డారు. పెంచిన మద్దతు ధరలు ఈ ఖరీఫ్ నుంచి అమల్లోకి రానున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ తరుణంలో మంచి గిట్టుబాటు ధర కలిగిన మొక్కజొన్న, రాగి, కంది పంటలపై రైతులు దృష్టి సారించాలని వ్యవసాయాధికారులు సలహా ఇస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా వేరుశనగ పంట పండిస్తున్నారని, ఆ పంటకు కొంత విరామం ఇచ్చి మిగిలిన పంటలను సాగుచేసుకుంటే అధిక ఆదాయం పొందేందుకు అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

పెరిగిన మద్దతు ధరలు

తీవ్ర నష్టాలకు గురవుతున్న రైతులను ఆదుకునే విధంగా ప్రభుత్వం పండిన పంటలకు మద్దతు ధరలు ప్రకటించింది. మొక్కజొన్న పంట క్వింటాలుకు రూ. 2,400, రాగి పంటకు రూ. 4,886, కందులుకు రూ. 8 వేలు, వేరుశనగ క్వింటాలుకు రూ. 7,263 గా ప్రభుత్వం ప్రకటించింది. గతంతో పోల్చితే ఈ ఏడాది మద్దతు

(మిగతా 6వ పేజీలో...)

ట్రెండు మారింది..!


రామములక్కాయలకు పెరిగిన గిరాకీ



ట్రాక్టర్‌లో చెట్లు సహా రామములక్కాయలను తరలిస్తున్న దృశ్యం

నంబులపూలకుంట, జూన్12(ఆంధ్రజ్యోతి): బీడు భూముల్లో పిచ్చి మొక్కగా అగుపిస్తూ, ముళ్లతో ఉండే చిన్న తీగ జాతి మొక్క రామములక చెట్టు. ఎందుకూ పనికిరాదని భావించే దీనికి గోళీ కాయ సైజులో కాయలు సైతం కాస్తాయి. వీటిని గతంలో పశువైద్యంలో ఉపయోగించేవారు. పశువు కంటికి గాయమైనా, పొర ఏర్పడినా ఈ కాయలతోనే వైద్యం చేసేవారని గ్రామాల్లోని వృద్ధ రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం ఆయుర్వేద వైద్యంలో వాడుతున్నట్లు సమాచారం. దీంతో రామములక్కాయలకు మంచి గిరాకీ ఏర్పడింది. అందుకే గత రెండు మూడు రోజులుగా వ్యవసాయ పొలాల్లో సేకరించిన రామములక్కాయలను చెట్లతో కేజీల వంతున కొందరు కొనుగోలు చేస్తున్నట్లు సమాచారం. ఈమొక్కను తాకాలంటే ముళ్లు ఎక్కువగా ఉంటాయి. అందుకే కట్టె సాయంతో వీటిని సేకరించి ట్రాక్టర్లతో తరలిస్తున్నారు.

ఆకాశంలో హరివిల్లు



చిగిచెర్ల వద్ద కనువిందు చేస్తున్న ఇంద్రధనుస్సు

ధర్మవరంరూరల్, జూన్12(ఆంధ్రజ్యోతి): ఆకాశంలో హరివిల్లు చూపరులకు కనువిందు చేసింది. మండలంలో గురువారం సాయంత్రం వర్షం కురిసి ఆగిపోయింది. చల్లటిగాలులు వీచే వేళలో వర్ణశోభితమైన వానవిల్లు ఆకాశంలో ఆవిష్కృతమైంది. చిగిచెర్లలో కనిపించిన ఈ దృశ్యాన్ని చూసి పలువురు ఆనందం వ్యక్తం చేశారు. తమ సెల్‌ఫోన్లలో ఫొటో తీసుకున్నారు.

దంచికొట్టిన వాన



6

గోవిందవాడ వద్ద మునిగిన వేరుశనగ పంట

ఇక సచివాలయ ఉద్యోగుల వంతు..

- బదిలీలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్
- నెలాఖరులోపు పూర్తి చేయాలని ఉత్తర్వులు

7

అక్రమాల ఆట..!

ఆడుదాం ఆంధ్రా.. అవినీతిమయం..

రూ.70 లక్షలకుపైగా దుర్వినియోగం

విజిలెన్స్ విచారణతో అక్రమార్కుల్లో అలజడి





నార్పల స్టేడియంలోని గదిలో ఉంచిన ఆడుదాం ఆంధ్రా కిట్లు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో ఆడుదాం.. ఆంధ్రా.. పోటీలు నిధులు బొక్కేసేందుకే నిర్వహించారన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. నాలుగేళ్లు క్రీడలను గాలికొదిలేసిన గత ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఆడుదాం ఆంధ్రా అంటూ నిధులు దోచేసే ఎత్తు వేసింది. క్రీడలంటే తెలియని వారికి పోటీలు నిర్వహించారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు కూడా పాల్గొన్నారు. వారికి నీరు కూడా ఇవ్వలేదు. ఏకంగా భోజనాలే పెట్టినట్లు బిల్లులు బొంచేశారు. క్రీడాకిట్ల నాణ్యత గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. నాసిరకమైన వాటిని సరఫరా చేశారు. ఇలా.. (మిగతా 6వ పేజీలో..)

ఏటీఎస్ ప్రారంభం

ఇక వాహన ఫిట్‌నెస్ పరీక్షలు బుక్కపట్నంలోనే..



బుక్కపట్నంలో ఏర్పాటు చేసిన ఏటీఎస్

బుక్కపట్నం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): వాహన ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించే ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్ (ఏటీఎస్)ను బుక్కపట్నంలో గురువారం ప్రారంభించారు. జిల్లాలో వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలు ఇక్కడే నిర్వహించనున్నారు. సర్టిఫికెట్లు కూడా ఇక్కడే జారీ చేయనున్నారు. స్లాట్ బుక్ చేసుకుంటేనే ఫిట్‌నెస్ పరీక్షలు చేయనున్నట్లు డీటీఓ కరుణసాగర్ రెడ్డి తెలిపారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

ఎస్పీ రత్న హెచ్చరిక



పుట్టపర్తిరూరల్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): సున్నితమైన విషయాలలో బాధిత కుటుంబాలను మరింత బాధపెట్టేవిధంగా వ్యవహరిస్తూ ధర్నాలు, రాస్తారోకోలు చేపట్టి శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ రత్న గురువారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. రామగిరి మండలంలో బాధితుల పరామర్శ పేరుతో పోలీసుల అనుమతి లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు చేపట్టి శాంతిభద్రతలకు విఘాతం కల్గించే వారిపై చట్టబద్ధమైన చర్యలు తీసుకుంటామన్నారు. బాలిక అత్యాచార సంఘటనకు సంబంధించి రాజకీయపార్టీలు ఆందోళనలు చేయడం ద్వారా బాధితుల వివరాలు బహిర్గతమై వారు ఇబ్బందులు పడే ప్రమాదం ఉందన్నారు. ఈవిషయంలో సున్నితత్వం గమనించి ఆందోళనలు, నిరసనలు చేయకూడదని ఎస్పీ సూచించారు. ఇందుకు భిన్నంగా ఎవరైనా వ్యవహరిస్తే అటువంటి వారిపై పోలీసులు శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలియచేశారు.

నిరసనల నడుమ కౌన్సెలింగ్

- మధ్యాహ్నం 12 గంటల తర్వాత ప్రారంభం
- సీరియల్ నంబర్ 351 నుంచి మొదలు
- ఆర్‌జేడీ శామ్యూల్ పరిశీలన

7


అనంతపురం నగరంలో వర్షపు నీటిలో పాఠశాల, కళాశాలకు వెళుతూ..


బుక్కరాయసముద్రం పాఠశాలలో యూనిఫాం తీసుకుని వెళ్తున్న విద్యార్థినులు


తొలిరోజు హాజరైన విద్యార్థినులు

తెరుచుకున్న పాఠశాలలు
- ఉదయం జోరు వర్షం
- పెద్దగా హాజరుకాని విద్యార్థులు
- నామమాత్రంగా పుస్తకాలు, యూనిఫాం పంపిణీ

తొలిరోజు తడబాటు..!






నంబర్ 2 పాఠశాలలో అడ్మిషన్లు తీసుకుంటున్న ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజనం చేస్తూ..

అనంతపురం విద్య, జూన్ 12(ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల తర్వాత గురువారం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. మొదటి రోజు కావడం, ఉదయం పాఠశాలలకు వెళ్లే సమయంలో వర్షం పడటంతో విద్యార్థులు మందకొడిగా హాజరయ్యారు. కొన్ని పాఠశాలలకు 10 నుంచి నుంచి 20 శాతం కూడా విద్యార్థులు హాజరు కాలేదు. కొన్నిచోట్ల తరగతి గదులు వెలవెలబోయాయి. తొలిరోజే విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ చేయాలని ఆదేశాలు ఉన్నాయి. కొన్ని స్కూళ్లలో నామమాత్రంగా, చాలా చోట్ల పంపిణీనే జరగలేదు. పుస్తకాలు, యూనిఫాం మాత్రమే పంపిణీ చేశారు.


అనంతపురం రూరల్ పాఠశాలలో తక్కువగా హాజరైన పిల్లలు

మొదటి రోజు నామమాత్రంగా..

సెలవుల తర్వాత స్కూళ్లు తెరుచుకోవడంతో ఒక వైపు వర్షం పడుతున్నా.. కొందరు పిల్లల బడికి వెళ్లారు. హాస్టళ్లలో ఉంటూ చదివే పిల్లలు పెట్టెలు, ఇతర లగేజీలు తీసుకుని తల్లిదండ్రులతో కలసి చేరుకుంటూ కనిపించారు. చాలా స్కూళ్లలో హాజరు పెద్దగా కనిపించలేదు. మొదటి రోజు కావడం, శని, ఆది వారాలు మళ్లీ సెలవులు కావడంతో చాలా మంది తల్లిదండ్రులు స్కూళ్లకు పంపడానికి ఆసక్తి చూపలేదు. ఫలితంగా విద్యార్థులు లేక చాలా ప్రాంతాల్లో పాఠశాలలు వెలవెలబోయాయి. పాఠశాలల పరిసరాలను సిబ్బంది శుభ్రం చేస్తూ కనిపించారు. మొదటి రోజు కొత్త అడ్మిషన్లు, టీసీల జారీతోపాటు, పిల్లలు తక్కువగా రావడంతో కిట్ల పంపిణీ పెద్దగా జరగలేదు.


తక్కువ సంఖ్యలో హాజరైన విద్యార్థులు


నంబర్ 2 స్కూల్‌లో వాలీబాల్ ఆడుతూ...

దంచికొట్టిన వాన

- పొంగిపొర్లిన వాగులు, వంకలు
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- నీట మునిగిన పంట పొలాలు


కొళగానహళ్లి గ్రామం వద్ద వరదనీటితో పారుతున్న కబ్బాలివంక

బొమ్మనహాళ్/విడపనకల్లు/ఉరవకొండ/కణేకల్లు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): మండలంలో రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు పత్తి, వేరుశనగ, మొక్కజొన్న పంటలు సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వ్యవసాయ బోరుబావుల కింద పత్తి, వేరుశనగ తదితర పంటలను రైతులు సాగు చేశారు. మండలంలోని కురిసిన వర్షాలకు వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. కొళగానహళ్లి గ్రామం వద్ద కబ్బాలివంకకు భారీగా వరదనీరు రావడంతో పొంగిపొర్లుతోంది. గాలి, వాన ఉధృతికి చెట్లు, విద్యుత్‌స్తంభాలు నేలకొరిగి విద్యుత్‌వైర్లు కిందకు వేలాడటంతో సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. గోవిందవాడ గ్రామ పరిధిలో ఇసుక పొలాల్లో సాగుచేసిన వేరుశనగ పంట దాదాపు 70 ఎకరాల్లో నష్టం జరిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లింగదహాళ్, రంగాపురంక్యాంపు, ఉప్పరహాళ్, సింగానహళ్లి తదితర గ్రామాలలో పత్తిపంట నీట మునిగింది. తెరిపిలేకుండా వానలు కురవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం

విడపనకల్లు మండలంలో బుధవారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పొలికి-అంచనహాలు, గడేకల్లు-ఆర్ కొట్టాల, పాల్తూరు-కళవల్లితిప్ప, ఉండబండ-ఉరవకొండ దారుల్లోని వంకలు పొంగి పొర్లటంతో మధ్యాహ్నం వరకూ రాక పోకలు నిలిచిపోయాయి.


విడపనకల్లులోని ఎస్‌డబ్ల్యూ పాఠశాలలోకి చేరిన వర్షపు నీరు

విడపనకల్లు గ్రామంలోని ఎస్‌డబ్ల్యూ పాఠశాలలోకి వర్షపు నీరు చేరడంతో ఎవరూ వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడి కేంద్రంలోకి వర్షపు నీరు చేరింది. భారీ వర్షం రావటంతో ఊరి చివర ఉన్న పెద్దాసుపత్రికి వెళ్లే దారి జలమయం అయ్యింది. ఈ దారిలో ఆసుపత్రికి వెళ్లే రోగులు, వైద్య సిబ్బంది తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. మండలంలో 91.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

ఉరవకొండలో భారీ వర్షం

ఉరవకొండ పట్టణంలో బుధవారం రాత్రి భారీ వర్షం కురిసింది. వాగులు, వంకలు పొంగి పొర్లాయి. 40మి.మీల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. భారీ వర్షానికి పాత బస్టాండ్‌లోని క్లాక్‌టవర్ కూడలిలో వర్షపు నీరు నిలబడటంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. శివారు ప్రాంతంలోని లోతట్టు ప్రాంతాలలో వర్షపు నీరు చేరడంతో కాలనీ వాసులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పొలాలు చెరువులను తలపించాయి.

తెగిన రహదారి

కణేకల్లు మండలంలోని మీండ్లపల్లి-గరుడచేడు మధ్య ఉన్న రహదారి బుధవారం రాత్రి కురిసిన వర్షానికి తెగింది. ఈ దారి పూర్తిగా శిథిలావస్థకు చేరుకోగా, అనుబంధంగా ఉన్న కల్వర్టు, రహదారి రెండూ వర్షం వల్ల తెగిపోయాయి. దీంతో ఆ ప్రాంతంలో పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించిపోయాయి. కణేకల్లు క్రాసింగ్‌తోపాటు పలు ప్రాంతాలలో స్తంభాలు ఒరగడంతో విద్యుత్ సమస్యలు ఏర్పడ్డాయి.


మీండ్లపల్లి, గరుడచేడు మధ్య తెగిన రహదారి

లక్షణాలు ఉంటే కరోనా పరీక్షలు

ప్రత్యేక కొవిడ్ వార్డు ఏర్పాటు

- ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు



అనంతపురం టౌన్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): కరోనా కేసులు జిల్లాలో మళ్లీ పెరుగుతున్నాయి. అనుమానిత లక్షణాలతో వస్తున్న వారికి పరీక్షలు చేస్తుండగా పాజిటివ్ వస్తోంది. ఇప్పటికే వరుసగా జిల్లా ఆసుపత్రిలో పరీక్షలు చేసిన వారిలో ఐదుగురికి పాజిటివ్ నిర్ధారణ అయింది. ఆసుపత్రిలో ఇద్దరు చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా ఆసుపత్రిలో తీసుకుంటున్న చర్యలు గురించి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు పలు విషయాలను వెల్లడించారు.

ఇంటర్వ్యూ

ప్రశ్న : కరోనా పరీక్షలు ఎంతమందికి చేశారు..?
జవాబు : కరోనా ప్రభావం మళ్లీ రావడంతో అనుమానిత లక్షణాలతో ఆసుపత్రికి వచ్చే వారికి పరీక్షలు నిర్వహిస్తున్నాం. గత 15 రోజులుగా ఈ పరీక్షలు చేస్తున్నాం. ఇప్పటికి 37 మందికి పరీక్షలు చేయగా.. ఐదుగురికి పాజిటివ్ వచ్చింది.

ప్రశ్న : కరోనా బాధితులకు చికిత్సలు ఎక్కడ అందిస్తున్నారు..?
జవాబు : జిల్లా సర్వజన ఆసుపత్రిలో కరోనా బాధితులకు అవసరమైన వైద్యం అందించడానికి ఏర్పాట్లు సిద్ధం చేశాం. 48 పడకలతో ప్రత్యేక వార్డును ఏర్పాటు చేశాం. ఆ విభాగానికి డాక్టర్లు, సిబ్బందిని నియమించాం. కోఆర్డినేటర్‌గా డాక్టర్ రమేష్‌ను నియమించాం.

ప్రశ్న : మందులు, మాస్కులు, ఇతర పరికరాలు ఉన్నాయా..?
జవాబు : కరోనా బాధితులకు అవసరమైన మందులు ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నాయి. ఇప్పటికి ఐదుగురికి పాజిటివ్‌రాగా.. ఇందులో ముగ్గురు హోమ్‌ఐసోలేషన్‌లో ఉంటున్నారు. మరో ఇద్దరు జిల్లా ఆసుపత్రిలోని ప్రత్యేక వార్డులో చికిత్స తీసుకుంటున్నారు. అవసరమైన మందులు ఉన్నాయి. మాస్కులు, శానిటైజర్, గ్లౌజులకు ఇండెంట్ పెట్టాం.

ప్రశ్న : కరోనా నియంత్రణకు ఏమి చేయాలి..?
జవాబు : ప్రతి ఒక్కరు మాస్క్ ధరించడం, సామాజిక దూరం పాటించడం, చేతులను శానిటైజర్‌తో శుభ్రం చేసుకుంటూ ఉండాలి. ఆసుపత్రికి వచ్చే రోగులకు అవగాహన కల్పిస్తున్నాం.

అక్రమాల ఆట..!

(5వ పేజీ తరువాయి)

అడుగడుగునా అక్రమాలకు పాల్పడ్డారు. ఉమ్మడి జిల్లాలో రూ.70 లక్షల వరకు నిధులను కాజేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ అంతులేని అవినీతిపై కూటమి ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఆ మేరకు విజిలెన్స్ అధికారులు మూడు బృందాలుగా బుధవారం విచారణ చేపట్టారు. ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే 25 మండలాల్లో విచారణ పూర్తి చేసినట్లు తెలిసింది. దీంతో అక్రమార్కుల్లో వణుకు మొదలైంది.


ఆడుదాం ఆంధ్రాపై విచారణ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

జగన్ బొమ్మలతో నాసిరకం కిట్లు

వైసీపీ ప్రభుత్వంలో సీఎం జగన్ బొమ్మలతో నాసిరకంగా స్పోర్ట్స్ కిట్లు, టీ షర్టులు అందజేశారు. ప్రభుత్వాధ్వర్యంలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు నిర్వహించినా... అంతా వైసీపీ నేతల కనుసన్నల్లోనే జరిగాయి. ఆటలపై కనీస అవగాహన లేని పిల్లలను మైదానంలోకి తీసుకువచ్చి... ఆడించడంతో పలుచోట్ల గొడవలు తలెత్తాయి. పలుచోట్ల పోటీలను వాయిదా వేయాల్సి వచ్చింది కూడా. ఇలా.. వైసీపీ నేతలు, అధికారులు అడ్డగోలుగా నిధులను కాజేశారు. ఆడుదాం ఆంధ్రా పోటీల సమయంలో ఉన్న అనంతపురం జిల్లా క్రీడాభివృద్ధి అధికారి(డీఎస్‌డీఓ) నిధులను దోచేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కూటమి పాలనలోనూ ఆ అధికారికి అందలం దక్కడం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

విజిలెన్స్ విచారణ కొనసాగుతోంది



ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలకు సంబంధించి విజిలెన్స్ విచారణ కొనసాగుతోంది. వివరాలు అడిగిన వెంటనే అందజేస్తున్నాం. ఆడుదాం ఆంధ్రా క్రీడా సామగ్రిని నార్పల స్టేడియంలో భద్రపరిచాం.

- ఉదయ్‌భాస్కర్, అనంతపురం, శ్రీసత్య జిల్లాల క్రీడాభివృద్ధి అధికారి


తుప్పు పట్టిన క్లోరినేషన్ సిలిండర్ అమర్చే పరికరాలు


పనిచేయని ఆలం మిక్సర్ ప్లాంట్ మోటారు

నీటిశుద్ధిపై నిర్లక్ష్యం

- వైసీపీ హయాంలో విడుదల కాని నిధులు
- కరుమరుగైన క్లోరినేషన్
- తుప్పుపట్టిన పరికరాలు
- సత్యసాయి తాగునీటి సరఫరాకు వెంటాడుతున్న కష్టాలు

కూడేరు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): తాగునీటి సరఫరాపైనా వైసీపీ పాలకులు నిర్లక్ష్యం వహించారు. గత పాలనలో సత్యసాయి నీటిశుద్ధి కేంద్రానికి నిధులు సక్రమంగా విడుదల చేయకపోవడంతో నిర్లక్ష్యానికి గురయింది. నాలుగేళ్లుగా నీటిని శుద్ధిచేయడానికి వినియోగించే క్లోరినేషన్ గ్యాస్‌ను వాడలేదు. కూడేరు మండలం పీఏబీఆర్ డ్యాంలోని సత్యసాయి తాగునీటి శుద్ధి కేంద్రంలో నీటిని శుద్ధి చేయడానికి వినియోగించే క్లోరినేషన్ గ్యాస్‌తోపాటు ఆలం మిక్సర్ మోటర్లు, పైపులు, ఇతర పరికరాలు పూర్తిగా దెబ్బతిని తుప్పు పట్టాయి. క్లోరినేషన్‌తోపాటు ఆలం ఉపయోగించి నీటిని శుద్ధి చేస్తారు. ఏరియేటర్‌లో నుంచి వచ్చే నీరు అపరిశుభ్రంగా ఉంటే అలంతోపాటు క్లోరినేషన్ గ్యాస్ కలుపుతారు. ఆ నీరు క్లారియేటర్‌కి వెళ్లి అక్కడ శుభ్ర పరిచిన అనంతరం నీరు మొత్తం ఫిల్టర్ హౌస్‌లోకి వెళ్తాయి. నీటిలో కలిపే క్లోరినేషన్ గ్యాస్ మాయమయింది. దీని స్థానంలో బ్లీచింగ్ పౌడర్‌ను కలపడం, అలం గడ్డలను నేరుగా నీటిలోకి వేయడంతో సక్రమంగా శుద్ధి కాలేదు. పీఏబీఆర్‌డ్యాంలోని సత్యసాయి తాగునీటి ప్లాంట్ నుంచి కూడేరు, ఆత్మకూరు, అనంతపురం రూరల్, కళ్యాణదుర్గం, కుందుర్పి, బెళుగుప్ప, ఉరవకొండ, రాప్తాడు, కంబదూరు తదితర మండలాల్లో దాదాపు 150 గ్రామాలకు నీటి సరఫరా జరుగుతోంది. పథకం ప్రారంభం నుంచి ఎల్‌అండ్‌టీ సంస్థ ఆధ్వర్యంలో శుద్ధి కేంద్రాన్ని నిర్వహించారు. వైసీపీ అధికారంలోకి రాగానే సత్యసాయి తాగునీటి పథకానికి నిధులు విడుదల చేయకపోవడంతో ఎల్‌అండ్‌టీ నిర్వహణ బాధ్యతల నుంచి తప్పుకుంది. అప్పటి నుంచి సత్యసాయి తాగునీటి పథకం నిర్లక్ష్యానికి గురయింది. నిధులు సక్రమంగా రాకపోవడంతో ప్లాంట్ నిర్వహణ, కార్మికులకు వేతనాలు కూడా ఇవ్వలేని దుస్థితి నెలకొంది. నీటిని సరఫరా చేసే విద్యుత్ మోటర్ ఇటీవల కాలిపోవడంతో దాదాపు 22 రోజులు నీరు బంద్ అయ్యాయి. దీంతో గ్రామాల్లో తాగునీరు లేక జనం అల్లాడిపోయారు. అదనపు మోటర్ లేకపోవడంతో కొత్త మోటర్ కొనుగోలు చేసి తీసుకురావడానికి ఇన్ని రోజులు పట్టింది. సత్యసాయి నీటి సరఫరా చరిత్రలో ఇలా జరగడం తొలిసారి. ఏరియేటర్ నుంచి వచ్చే నీటిలోకి బ్లీచింగ్‌తోపాటు అలంను కలిసిన నీరు క్లారియేటర్‌లోకి వెళితే ఆ నీరును శుద్ధి చేయడానికి వినియోగించే మోటర్ గత నాలుగు సంవత్సరాలుగా పని చేయలేదు. దీంతో క్లారియేటర్‌లోకి వచ్చిన నీరు వచ్చినట్లు ఫిల్టర్ హౌస్‌లోకి వెళుతున్నాయి. అక్కడి నుంచి సంపులోకి పంపి గ్రామాలకు సరఫరా చేస్తున్నారు.


పనిచేయని క్లారియేటర్ మిషన్

మరమ్మతులకు నిధులు విడుదల

ఉమ్మడి అనంతపురం జిల్లాలోని సత్యసాయి తాగునీటి పథకంలో పనిచేయని క్లోరినేషన్ ప్లాంట్ మరమ్మతులకు నిధులు విడుదలయ్యాయి. గత ప్రభుత్వంలో నిధులు సక్రమంగా రాకపోవడంతో క్లోరినేషన్ గ్యాస్ వినియోగించలేదు. కేవలం బ్లీచింగ్ పౌడర్ కలిపి నీటిని సరఫరా చేశాం. ప్రస్తుత ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. నాలుగు నీటిశుద్ధి కేంద్రాల్లో క్లోరినేషన్ గ్యాస్ ప్లాంట్ తోపాటు ఆలం కలిపే ప్లాంట్లకు మరమ్మతులు చేస్తాం.

-రామారావు, డీఈ, ఆర్‌డబ్ల్యూఎస్

మద్దతు ధరలతో ఊరట

(5వ పేజీ తరువాయి)

ధరలు బాగా పెరిగాయి.

ధరలు లేక దళారుల పాలయ్యేవి..

వైసీపీ ప్రభుత్వ హయాంలో రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక కల్లాల్లోనే అందినకాడికి అమ్ముకునేవారు. దళారులు ఎంత చెబితే అదే ధర. పంట పండినా మద్దతు ధరకు అమ్ముకోలేక రైతులు ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుత ప్రభుత్వం మొక్కజొన్న, రాగి, కంది, వేరుశనగ పంటలకు గిట్టుబాటు ధరలు ప్రకటించి కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకుంది. గతంలో బహిరంగ మార్కెట్‌లో రాగి పంట క్వింటాలు రూ. 2 వేల నుంచి రూ. 3 వేల వరకు పలికేది. ఇప్పుడు ప్రభుత్వం క్వింటాలుకు రూ. 4,886 మద్దతు ధర ప్రకటించింది. మొక్కజొన్న క్వింటాలుకు రూ. 2 వేల నుంచి రూ. 2,200 వరకు ఉండగా.. ఇప్పుడు ప్రభుత్వ మద్దతు ధరే రూ. 2400 ప్రకటించింది. కంది పంట మార్కెట్లో క్వింటాలు రూ. 5,500 నుంచి రూ. 6,500 వరకు ఉండేది. ఇప్పుడు ప్రభుత్వం ఏకంగా రూ. 8 వేల మద్దతు ధర ప్రకటించింది.

ప్రభుత్వమే కొనడం మంచి పరిణామం



గతంలో ఎంతో కష్టపడి పండించిన పంటలకు మద్దతు ధరలు లభించక నష్టాలకు గురయ్యాం. దళారులు ఎంతకు అడిగితే అంతకు పంటను అమ్ముకోవాల్సి వచ్చేది. ఇప్పుడు ప్రభుత్వం మంచి మద్దతు ధరలు నిర్ణయించి రైతులకు న్యాయం చేసింది. మద్దతు ధర కల్పిస్తూనే వాటిని ప్రభుత్వమే కొనుగోలు చేస్తామని చెప్పడం శుభపరిణామం. దీంతో ధైర్యంగా పంటలు సాగుచేసుకునే వీలుంది. **-వేణుగోపాల్, దేమకేతేపల్లి**

రైతులకు న్యాయం జరిగింది



ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలతో రైతులకు కొంత న్యాయం జరిగింది. గత ప్రభుత్వంలో మద్దతు ధర లేక నష్టాలకే పంటలను అమ్ముకున్నాం. మొక్కజొన్నకు మాత్రమే మద్దతు ధర ఇచ్చారు. అది కూడా మార్కెట్ ధర కంటే తక్కువగా ఉండటంతో రైతులకు ఉపయోగం లేకుండా పోయింది. ఇప్పుడు మొక్కజొన్న, కంది, రాగి పంటలకు మంచి మద్దతు ధర ప్రకటించారు. ఈ సీజన్‌లో ఈ పంటలనే సాగు చేస్తాం. **-రంగప్ప, సోమఘట్ట**

గిట్టుబాటు ధరలతో రైతులకు మేలు



ప్రభుత్వం గత ఏడాది కంటే మొక్కజొన్న, రాగి, కంది, వేరుశనగ పంటలకు మంచి మద్దతు ధర ప్రకటించింది. ఈ ధరలతో రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. ప్రధానంగా ఈ ప్రాంతానికి అనువైన మొక్కజొన్న, కంది, రాగి పంటలపై రైతులు ఆసక్తి చూపాలి. తక్కువ పెట్టుబడితో మంచి లాభం పొందడానికి అవకాశం ఉంది. మార్కెట్లో గిట్టుబాటు ధరలు లేకపోతే.. మద్దతు ధరతో ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది. రైతులు ఈ విషయాన్ని గుర్తించుకోవాలి.

-వంశీకృష్ణ, మండల వ్యవసాయాధికారి, చిలమత్తూరు

దేవదాయ శాఖ ఏసీ బాధ్యతల స్వీకరణ



తిరుమలరెడ్డికి అభినందనలు తెలుపుతున్న అర్చక సమాఖ్య నాయకులు

అనంతపురం కల్చరల్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): దేవదాయ, ధర్మదాయ శాఖ జిల్లా ఇన్‌చార్జ్ సహాయ కమిషనర్‌గా తిరుమలరెడ్డి బాధ్యతలు చేపట్టారు. గతంలో ఈ స్థానంలో ఉన్న ఆదిశేషనాయుడును ప్రధాన కార్యాలయానికి సరెండర్ చేశారు. కర్నూలు జిల్లా డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న తిరుమలరెడ్డి అనంతపురం జిల్లా సహాయ కమిషనర్‌గా ఇన్‌చార్జి బాధ్యతలు స్వీకరించారు. ఈ నేపథ్యంలో గురువారం ఉమ్మడి అనంతపురం జిల్లా అర్చక సమాఖ్య నాయకులు తిరుమలరెడ్డిని కలిసి శాలువా, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. జిల్లాలోని పలువురు ఈఓలు ఇన్‌చార్జ్ సహాయ కమిషనర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అర్చక సమాఖ్య అధ్యక్షుడు వైపీ ఆంజనేయులు, కోశాధికారి శ్రీనివాసులు, పాల్తూరు విజయ్, చంద్రమౌళి, నవీన్, చేతన్, ఉదయ్, తిరుపతయ్య, మధుసూదనాచార్యులు పాల్గొన్నారు.

ఇక సచివాలయ ఉద్యోగుల వంతు..

బదిలీలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్

నెలాఖరులోపు పూర్తి చేయాలని ఉత్తర్వులు

అనంతపురం న్యూటౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) సచివాలయ ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ వచ్చింది. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ నెలాఖరులోపు పూర్తి చేయాలని ప్రభుత్వ కార్యదర్శి భాస్కర్ జీఓ ఎంఎస్ నెంబర్-5 ను గురువారం జారీ చేశారు. బదిలీల ప్రక్రిలో భాగంగా చేపట్టాల్సిన నియమ నిబంధనలను కూడా అందులో పేర్కొన్నారు. ఒకే స్థానంలో మే 31లోగా ఐదేళ్లు పూర్తి చేసుకున్నవారిని తప్పనిసరిగా బదిలీ చేయా లని పేర్కొన్నారు. సొంత మండలంలో ఉండకుండా చూడాలన్నారు. రెండేళ్లకు పైబడి ట్రైబల్ ప్రాంతాల్లో పని చేసిన వారికి బదిలీలకు అవకాశం కల్పించాలన్నారు. స్పౌజ్, దీర్ఘకాలిక అనారోగ్యం ఉన్న వారికి మినహాయింపులు ఇచ్చేలా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీంతో ఉమ్మడి జిల్లాలో గ్రామ సచివాలయాల్లో పని చేసే గ్రేడ్-5 సిబ్బందికి సంబంధిం చి క్యాడర్ స్ట్రెంత్ 567 ఉంది. అయితే 487 మంది మాత్రమే వర్కింగ్‌లో ఉన్నారు. 80 స్థానాలు ఖాళీగా ఉన్నాయి. గ్రేడ్-6 డిజిటల్ అసిస్టెంట్స్‌కు సంబంధించి క్యాడర్ స్రెంత్ 896 ఉండగా ప్రస్తుతం 841 మంది మాత్రమే వర్కింగ్‌లో ఉన్నారు. 55 ఖాళీలు ఉన్నాయి. బదిలీల ప్రక్రియ ఈ నెల 30లోపు పూర్తి చేసి జూలై 10 లోపు ఆన్‌లైన్‌లో వివరాల నమోదు పూర్తి చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఎట్టకేలకు ఏఓల బదిలీ ఉత్తర్వులు

అనంతపురం అర్బన్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ అధికారుల బదిలీల ఉత్తర్వులు ఎట్టకేలకు జారీ అయ్యాయి. ఈనెల 9వతేదీ అర్ధరాత్రి వ్యవసాయ శాఖ అధికారుల బదిలీల ఉత్తర్వులు జారీ చేయగా.. ఆ మరుసటి రోజు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కార్యాలయం ఆదేశాలతో ఆపేశారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ అధికారుల బదిలీల తుది జాబితాను ఆ శాఖ కమిషనరేట్ ఉన్నతాధికారులు గురువారం విడుదల చేశారు. ఉమ్మడి అనంత జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఏఓలను బదిలీ చేయడంతోపాటు కర్నూలు, కడప జిల్లాల్లో పనిచేస్తున్న కొందరు ఏఓలను ఇక్కడికి బదిలీ చేశారు. ఈ క్రమంలో 73 మంది అధికారులను బదిలీ చేశారు. పాత జాబితాతో పోలిస్తే.. పరిగి, ఎరువుల పరీక్షా కేంద్రాలకు బదులుగా.. ఇద్దరు ఏఓలకు ఒకరికి భూసార సంరక్షణా కేంద్రం, మరొకరికి భూసార పరీక్షా కేంద్రానికి మార్పు చేశారు. మిగతా ఏఓల బదిలీల్లో ఎలాంటి మార్పు చేయలేదు. మిగతా జిల్లాల్లో కొన్ని మార్పులు చేసినట్లు సమాచారం. జేడీఏ కార్యాలయంలో టెక్నికల్ ఏఓగా పనిచేస్తున్న వెంకట్‌కుమార్ అనంతపురం ఏఓగా, మరో టెక్నికల్ ఏఓ బాలూనాయక్‌ను రైతు శిక్షణా కేంద్రానికి బదిలీ చేశారు. వెంకట్‌కుమార్ అక్కడ రిలీవ్ కావడంతోపాటు అనంతపురం ఏడీకి జాయినింగ్ రిపోర్టు ఇవ్వగా.. బాలూనాయక్ రైతుశిక్షణా కేంద్రంలో రిపోర్టు చేసుకున్నారు. వీరిద్దరు శుక్రవారం కొత్త స్థానాల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు ఏఓలు గురువారం రిలీవ్ అయ్యారు. మిగతా ఏఓలు శుక్రవారం రిలీవ్ అయి, కొత్త స్థానాల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు.

ఆ శాఖల్లో విడుదల కాని జాబితా

పశుసంవర్ధక, మత్స్య శాఖలకు సంబంధించిన అధికారులు, ఉద్యోగుల బదిలీల జాబితా ఇంకా విడుదల కాలేదు. ఏఓల జాబితా విడుదల కావడంతో తమ శాఖల్లో బదిలీల జాబితాలు వస్తాయని ఆయా శాఖల అధికారులు నిరీక్షించారు. ఆ ఊసేలేకపోవడంతో తీవ్ర నిరాశకులోనయ్యారు. దీంతో ఎప్పటిలోగా తమకు బదిలీ ఉత్తర్వులు జారీ చేస్తారో తెలియని అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు.

చీనీ టన్ను రూ.33 వేలు

అనంతపురంరూరల్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో గురువారం చీనీకాయలు టన్ను గరిష్టంగా రూ.33,640 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్టంగా రూ.5వేలు, సరాసరి రూ.20వేలతో అమ్ముడుపోయాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 680టన్నుల చీనీకాయలు వచ్చినట్లు చెప్పారు.

తొలిరోజే పస్తు

మధ్యాహ్న భోజనం లేక విద్యార్థుల ఇబ్బందులు

రొద్దం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): బిల్లులు రాలేదని విద్యార్థులను పస్తులు ఉంచిన సంఘటన ఎం.కొత్తపల్లి ప్రాథమిక పాఠశాలలో గురువారం జరిగింది. ఇక్కడ మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వహించే రామాంజప్పకు నాలుగు నెలలుగా బిల్లులు రాలేదు. దీంతో పాఠశాల ప్రారంభమైన తొలి రోజే భోజనం వండిపెట్టడానికి ఆయన మొండికేశారు. దీంతో పాఠశాలకు వచ్చిన విద్యార్థులు మధ్యాహ్న భోజనం లేక అల్లాడిపోయారు. ఈ విషయంపై ఎంఈఓ జయభాస్కర్‌ను వివరణ కోరగా ఏజెన్సీ నిర్వాహకుడు రాకపోవడంతో మధ్యాహ్న భోజనం పెట్టలేదని, శుక్రవారం నుంచి తప్పకుండా అమలు చేస్తామని పేర్కొన్నారు.

అద్వితీయం

'తల్లికి వందనం'లో జిల్లాకు రాష్ట్రంలో రెండో స్థానం

అర్హులైన 2,94,559 మంది విద్యార్థులు

1,84,695 మంది తల్లులకు లబ్ధి

ఒకటి, ఇంటర్ అడ్మిషన్ల తర్వాత మరింత పెరిగే చాన్స్

అనంతపురం విద్య, జూన్ 12(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా 2,94,559 మంది విద్యార్థులను తల్లికి వందనం పథకానికి అర్హులుగా విద్యాశాఖ తేల్చింది. దీంతో 1,84,695 మంది పిల్లల తల్లులకు లబ్ధి చేకూరనుంది. 2వ తరగతి నుంచి 10వ తరగతి వరకూ, ఇంటర్ సెకెండ్ ఇయర్ విద్యార్థులకు సంబంధించి ఈ మేరకు విద్యాశాఖ అర్హులను ఎంపిక చేసింది. తర్వాత 1వ క్లాస్, ఇంటర్ ఫస్ట్ ఇయర్ అడ్మిషన్లు పూర్తయిన తర్వాత ఈ లబ్ధిదారుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. తల్లికి వందనం కింద ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ. 15 వేల ఆర్థిక సాయం అందిస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. గతంలో ఒకటో తరగతి నుంచి ఇంటర్ సెకెండియర్ వరకూ చదివే విద్యార్థులు ఇంట్లో ఎంత మంది ఉన్నా ఒకరికే అమ్మఒడి ఇచ్చే వారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికీ ఇస్తామని ప్రకటించింది. చెప్పినట్లుగానే స్కూళ్ల పునఃప్రారంభం రోజునే తల్లికి వందనం పథకానికి సంబంధించిన జీవోలు 26, 27 విడుదల చేశారు. ఆ దిశగా ప్రభుత్వం పిల్లల తల్లులకు లబ్ధి చేకూర్చేందుకు అడుగేసింది. రాష్ట్రంలో కర్నూలు తర్వాత అనంతపురం జిల్లాలోనే అత్యధికంగా తల్లులను అర్హులుగా గుర్తించారు.

తల్లిదండ్రుల్లో సంతోషం

పాఠశాలల ప్రారంభం రోజునే తల్లికి వందనం అమలు చేస్తూ జీవోలు విడుదల కావడం ప్రభుత్వ, ప్రైవేట్ విద్యార్థుల తల్లిదండ్రుల్లో సంతోషాన్ని నింపింది. పేరెంట్స్, ప్రైవేట్ స్కూళ్ల కరస్పాండెంట్లు ఇలా అందరి నోటా ఇదే మాట గురువారం వినిపించింది. తల్లికి వందనం పథకానికి సంబంధించిన కీలక బాధ్యతలు గ్రామ, వార్డు సచివాలయాలకు అప్పగించారు. గురువారం మధ్యాహ్నం 3 గంటలపైన అన్ని గ్రామ వార్డు సచివాలయాలకు జాబితాలు కేటాయించారు. ఆయా సచివాలయాల పరిధిలోని లబ్ధిదారులు, అనర్హుల జాబితాలను సచివాలయాలకు కేటాయించారు. తుది అర్హులు, అనర్హుల జాబితాలు పంపారు. నాలుగు చక్రాల వాహనం ఉన్నవాళ్లు, విద్యుత్ వినియోగం నగటున 300 యూనిట్లు కంటే ఎక్కువ ఉన్న వాళ్లు, సరైన ఇన్‌కం సర్టిఫికెట్ అప్‌లోడ్ చేయని వారిని, మెట్ట భూమి 10 ఎకరాల కంటే ఎక్కువ ఉన్న వారిని, ఆదాయపు పన్ను చెల్లించే వారిని, పట్టణాల్లో రూ.12 వేలుపైన, గ్రామాల్లో రూ.10 వేల కంటే ఎక్కువ నెల ఆదాయం ఉన్న కుటుంబాలను అనర్హుల జాబితాలో ఉంచారు. అర్హుల, అనర్హుల జాబితాలను సచివాలయాల్లో ప్రదర్శిస్తారు. తర్వాత లబ్ధిదారులు ఏవైనా సందేహాలున్నా, గ్రీవెన్సులున్నా, సచివాలయాల వద్దకు వెళ్లి ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది.

పరామర్శ.. పన్నాగం..!

(5వ పేజీ తరువాయి)

లబ్ధి కోసం అరాచకానికి తెరలేపారు.

ఆ ఘటన మరువకనే..

ఈ ఏడాది ఏప్రిల్ 8న మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ పాపిరెడ్డిపల్లి పరామర్శలో జగన్నాటకంతో ప్రభుత్వ భద్రతా వైఫల్యంగా చిత్రీకరించే కుట్రకు తెరలేపిన సంగతి తెలిసిందే. కుంటిమద్ది సమీపంలో హెలీప్యాడ్‌లో దిగిన జగన్ పోలీసులు తగిన భద్రత కల్పించలేదనీ, హెలీకాప్టర్ విండ్‌షీల్డ్ దెబ్బతిందంటూ రోడ్డు మార్గాన బెంగళూరుకు వెళ్లి హైడ్రామాకు తెరలేపారు. పోలీసుల వైఫల్యం అంటూ ప్రభుత్వంపై నిందలు వేసేందుకు వైసీపీ నేతలు ప్రయత్నించారు. పోలీసుల బట్టలూడదీస్తానంటూ జగన్ హెచ్చరించారు. ఇదంతా వైసీపీ కుట్ర అని తేల్చిన పోలీసులు.. ఆ పార్టీ నేతలపై కేసులు కట్టారు. ఇదే తరహాలోనే బాలికపై అత్యాచారం ఘటనను రాజకీయంగా లబ్ధిపొందేలా కుట్ర పన్నుతున్నట్లు స్పష్టమవుతోంది. అందులో భాగమే వైసీపీ 'చలో పేరూరు' అన్న వాదనలు వినిపిస్తున్నాయి. రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఇందులో కీలకంగా మారి జిల్లా నలుమూలల నుంచి శ్రేణులను పేరూరుకు తరలించే ప్రయత్నం చేశారు. పరామర్శల పేరుతో మరోమారు శాంతిభద్రతలకు విఘాతం కలిగించి, ఉద్రిక్తతలు సృష్టించే కుతంత్రం పన్నారు. అది కూడా.. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన రోజున టీడీపీ శ్రేణులను రెచ్చగొట్టే ప్రణాళిక రూపొందించినట్లు తెలుస్తోంది. పోలీసులు ముందస్తుగా పేరూరుకు వెళ్లే దారులన్నింటినీ దిగ్బంధించి, వైసీపీ పరామర్శ కుట్రను భగ్నం చేశారు.

ఎవరిని పరామర్శిద్దామని..?

అత్యాచార బాధిత బాలిక అనంతపురంలో చికిత్స పొందుతోంది. కుటుంబ సభ్యులు కూడా అక్కడే ఉన్నారు. బాధిత కుటుంబసభ్యుల పరామర్శ పేరుతో మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి 'చలో పేరూరు'కు పిలుపునిచ్చారు. పేరూరుకు వెళ్లేందుకు వివిధ మార్గాల్లో ఆయనతోపాటు వైసీపీ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్, జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, మాజీ మంత్రి మేరుగ నాగార్జున, వైసీపీ శింగనమల ఇన్‌చార్జి సాకే శైలజానాథ్ మరికొందరు చేసిన ప్రయత్నాలను పోలీసులు అడ్డుకున్నారు. శాంతిభద్రతల దృష్ట్యా చలో పేరూరుకు అనుమతి లేదని పోలీసులు ప్రకటించినా వైసీపీ నేతలు బేఖాతరు చేయడం అనుమానాలకు తావిస్తోంది. పెనుకొండలో జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ జాతీయ రహదారిపై బైఠాయించారు.



పోలీసులతో వాగ్వాదం చేస్తున్న ఉషశ్రీ

బాధిత బాలిక అనంతపురంలో ఉంటే పేరూరుకు పరామర్శకు పిలుపునివ్వడం వైసీపీ కుట్రకు నిదర్శనం. అత్యాచార బాధిత బాలిక పేరు, గ్రామం వెల్లడించకూడదని సుప్రీంకోర్టు మార్గదర్శకాలున్నా.. వైసీపీ పరామర్శకు పిలుపునివ్వడం శోచనీయం. పైగా కూటమిప్రభుత్వం ఏడాది పాలన టీడీపీ నాయకులు పెద్ద ఎత్తున విజయోత్సవ ర్యాలీ సంబరాలు చేసుకుంటున్న వేళ వైసీపీ పరామర్శల పేరుతో జిల్లావ్యాప్తంగా శ్రేణులను పేరూరుకు తరలించే ఎత్తుగడ చూస్తే గొడవ జరిగితే భద్రతా వైఫల్యం అంటూ ప్రభుత్వంపై నిందలు వేసే కుట్ర అని స్పష్టమవుతోంది.

పోలీసులకు మేరుగ వార్నింగ్

పేరూరుకు వెళ్తున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, మాజీ మంత్రి మేరుగ నాగార్జునను కనగానపల్లి మండలం మద్దెలచెరువులో పోలీసులు అడ్డుకున్నారు. పేరూరుకు వెళ్లేందుకు అనుమతి లేదనీ, వెనుదిరిగి వెళ్లాలని సూచించారు. వారిపై మాజీ మంత్రి మేరుగ నాగార్జున చిందులు తొక్కారు. 'ప్రభుత్వం మారుతుంది. మళ్లీ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కాబోతున్నారు. మీరు బాధ్యతాయుతంగా ఉండకపోతే ఇబ్బందులుపడతారం'టూ పోలీసులకు వార్నింగ్ ఇచ్చారు. ఇంకోరోజు వేయి మందితో వస్తాననీ, అప్పుడు అడ్డుకుంటారా అంటూ సవాల్ విసిరారు.

ఉషశ్రీ వాగ్వాదం

పెనుకొండ రూరల్: వైసీపీ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ.. పోలీసులతో వాగ్వాదానికి దిగారు. 'చలో పేరూరు'కు వెళ్తున్న పెనుకొండలోని శ్రీకృష్ణదేవరాయల సర్కిల్‌లో జాతీయ రహదారిపై ఉషశ్రీ, పార్టీ శ్రేణులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అక్కడే బైఠాయించి, నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తాము వెళ్లి తీరతామంటూ పోలీసులతో ఆమె వాగ్వాదానికి దిగారు. అనంతరం సీఐ రాఘవన్, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, సిబ్బందితో వెళ్లి ఉషశ్రీని హౌస్ అరెస్టు చేశారు.

రైతులకు బురిడీ..!

పాసుపుస్తకాలు తనఖా పెట్టి రూ.11 కోట్ల రుణం

ఏడు సంవత్సరాలైనా తిరిగి చెల్లించని వైనం

లబోదిబోమంటున్న 42 మంది రైతులు

నరేంద్రరెడ్డిపై కణేకల్లు పోలీసులకు ఫిర్యాదు

కణేకల్లు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): తమను నమ్మించి, తమ పేరుతో ఉన్న పాసుపుస్తకాలను పలు బ్యాంకుల్లో తనఖా పెట్టి ఏడు సంవత్సరాల క్రితం తీసుకున్న రూ.11 కోట్లను తిరిగి చెల్లించకపోవడంతో తమ పరిస్థితి దయనీయంగా తయారయిందని పలువురు రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కణేకల్లు మండలానికి చెందిన 42 మంది రైతులు గురువారం ఈ విషయంపై విలేకరులతో తమ గోడును వెళ్లబోసుకున్నారు. ఏడేళ్ల క్రితం కణేకల్లుకు చెందిన నరేంద్రరెడ్డి అనే వ్యక్తి పలువురు రైతులను నమ్మించి వారి పొలం పాసుపుస్తకాలతో బొమ్మనహాళ్‌లోని కర్ణాటక బ్యాంక్, కణేకల్లులోని ఆంధ్రాబ్యాంక్‌లో తనఖా పెట్టి సుమారు రూ. 11 కోట్ల మేర రుణం తీసుకున్నాడు. ఇతడు మండల కేంద్రంలో కేసీఎన్‌ఆర్ కల్యాణమండపంతో పాటు చేపల కాలనీలో కేసీఎన్‌ఆర్ వేర్‌హౌస్‌ను నిర్మించాడు. కానీ రైతులకు సంబంధించిన బ్యాంకులో తీసుకున్న సొమ్ము తిరిగి చెల్లించకపోవడంతో గత ఏడేళ్లుగా బ్యాంకర్లు పాసుపుస్తకాలకు సంబంధించి రైతులను రుణం కట్టాలని ఒత్తిడి తెస్తున్నారు. ఈ విషయాన్ని రైతులందరూ నరేంద్రరెడ్డి దృష్టికి పలుమార్లు దృష్టికి తీసుకుపోయి రుణం చెల్లించాలని అడుగుతున్నప్పటికీ ఆయన చెల్లించకపోవడంతో ఏడేళ్లుగా రైతులు నలిగిపోతున్నారు. దీంతో వారంతా గురువారం కేసీఎన్‌ఆర్ కల్యాణమండపం, కేసీఎన్‌ఆర్ వేర్‌హౌస్‌కు తాళాలు వేసి తమ డబ్బులు చెల్లించేంత వరకు వదిలేది లేదని ఆందోళనకు దిగారు. అలాగే నరేంద్రరెడ్డిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



కేసీఎన్‌ఆర్ కల్యాణ మండపం వద్ద మాట్లాడుతున్న రైతులు

గుంతకల్లు మీదుగా ప్రత్యేక రైలు

గుంతకల్లు, జూన్12(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ నియంత్రణకు బెంగళూరు-బీదర్ మధ్య (వయా గుంతకల్లు) ప్రత్యేక రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. బెంగళూరు-బీదర్ (నం. 06539) ప్రత్యేక రైలును ఈ నెల 15, 20, 22, 27, 29 తేదీల్లో నడపనున్నట్లు వెల్లడించారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 06540)ను ఈ నెల 16, 21, 23, 28, 30 తేదీల్లో నడపనున్నట్లు వివరించారు. ఈ రైలు యలహంక, హిందూపురం, ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూరు, క్రిష్ణా, యాద్గిర్, వాడి, షాద్‌నగర్, కలబురగి, హోమ్నాబాద్ స్టేషన్ల మీదుగా వెళ్తుందని పేర్కొన్నారు.

స్కూళ్లు, హాస్టళ్లకు సన్నబియ్యం

అవకతవకలకు ఆస్కారం లేకుండా క్యూఆర్ కోడ్

పౌర సరఫరాల శాఖ మేనేజర్ రమేష్‌రెడ్డి

అనంతపురంటౌన్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులకు మరింత నాణ్యమైన భోజనం అందించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని పౌర సరఫరాలశాఖ జిల్లా మేనేజర్ రమేష్‌రెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన గురువారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఇక నుంచి పాఠశాలలు, హాస్టళ్లకు ప్రత్యేకంగా సన్న బియ్యం సరఫరా చేస్తామని పేర్కొన్నారు. పౌర సరఫరాల సంస్థ గోదాముల నుంచి నాణ్యమైన సన్న బియ్యాన్ని 25 కిలోల ప్యాకెట్ల రూపంలో సరఫరా చేస్తామన్నారు. జిల్లాలో 1715 పాఠశాలలు, 183 వసతి గృహాలకు నేరుగా గోదాముల నుంచే సన్నబియ్యం పంపిణీ చేస్తామని తెలిపారు. అవకతవకలు జరగకుండా ఉండేందుకు ప్రతి 25 కిలోల బియ్యం ప్యాకెట్‌కు ప్రత్యేకంగా క్యూఆర్‌కోడ్ జతపరిచామని అన్నారు. ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్‌చేస్తే బియ్యానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకోవచ్చన్నారు. హెచ్‌ఎంలు, వార్డెన్లు బాధ్యతగా వ్యవహరించి పిల్లలకు భోజనం అందించాలని డీఎం రమేష్‌రెడ్డి కోరారు.

నిరసనల నడుమ కౌన్సెలింగ్

మధ్యాహ్నం 12 గంటల తర్వాత ప్రారంభం

సీరియల్ నంబర్ 351 నుంచి మొదలు

ఆర్‌జేడీ శామ్యూల్ పరిశీలన

అనంతపురం విద్య, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీల కౌన్సెలింగ్ నిరసనల నడుమ కొనసాగుతోంది. మూడో రోజు కూడా పంగల్ రోడ్డులోని ఆర్డీటీ ఆడిటోరియంలో ఎస్‌జీటీల కౌన్సెలింగ్ నిర్వహించారు. బుధవారం రాత్రి అంతా సాగిన కౌన్సెలింగ్ గురువారం ఉదయం 6 గంటల వరకూ నిర్వహించి తర్వాత బ్రేక్ ఇచ్చారు. అనంత రం ఉదయం 10 గంటలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ప్రకటించినా తీవ్ర నిద్ర బడలిక వల్ల ఉద్యోగులు ఆలస్యంగా రావడంతో మధ్యాహ్నం 12 గంటల తర్వాత కౌన్సెలింగ్ ప్రారంభించారు. సీరియల్ నెంబర్ 351 నుం చి కౌన్సెలింగ్ మొదలు పెట్టారు. ఆర్‌జేడీ శామ్యూల్, జిల్లా పరిశీలకులు సుబ్బారావు కౌన్సెలింగ్‌ను పరిశీలించారు. రాత్రి 10 గంటలకు సీరియల్ నెంబర్ 700 వరకూ కౌన్సెలింగ్ పూర్తి చేశారు.

డీఈఓ పూల్ టీచర్ల నిరసన

డీఈఓ పూల్ లో ఉన్న భాషాపండితులు కౌన్సెలింగ్ సెంటర్ బయట నేలపై కూర్చొని నిరసన తెలిపారు. బలవంతపు బదిలీలు మాకొద్దు, భాషా పండితులను ఉన్నతీకరించి, శాశ్వత స్థానాలు కేటాయించాలంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. గత ఆరేళ్లుగా బదిలీలు, వర్క్ అడ్జెస్ట్‌మెంట్ అంటూ అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని బాధిత టీచర్లు, సంఘాల నాయకులు వాపోయారు. తర్వాత సమస్యలను ఆర్‌జేడీ శామ్యూల్ దృష్టికి తీసుకెళ్లారు.



నిరసన తెలుపుతున్న డీఈఓ పూల్ టీచర్లు

పులిపిరికి అరుదైన చికిత్స



▸▸ ఆకుపసరుతో నిమిషాల్లో తొలగింపు

అనంతపురం జిల్లా : జూన్ 13: పులిపిర్లకు వడియార మల్లికార్జున అరుదైన చికిత్స నందిస్తున్నారు. ఆకుపసరుతో నిమిషాల్లో శరీరంపై ఉన్న పులిపిర్లు తొలగిస్తామంటున్నారు. అనంతపురం జిల్లాలోని, కీర్తిరెసిడెన్సీ, కమలా నగర్, DCMS రోడ్, అనంతపురం నందు ఆయన పులిపిర్లకు చికిత్స అందిస్తున్నారు. ఈ నెల 12, 13, 14 తేదీల్లో మూడు రోజుల పాటు వాటికి చికిత్స అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం పలువురికి పులిపిర్లు తొలగించారు. సాధారణంగా మనిషిలో 7 రకాలుగా ఈ పులిపిర్లు కనిపిస్తాయన్నారు. ఏ రకమైన పులిపిరినైనా సరే తాము సేకరించిన పొడిని తడిపిన దూదితో పులిపిరిపై అద్ది తక్షణమే తొలగిస్తామన్నారు. అనంతరం అదే పొడి మళ్లీ పులిపిరి తొలగించిన ప్రదేశంలో అద్దుతామన్నారు. శుక్ర, శని రెండు రోజుల్లో మాత్రమే వైద్యం అందుబాటులో ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. 9849628485 నెంబర్లులోని సంప్రదించాలన్నారు.

త్రీటౌన్‌లో కానిస్టేబుల్ సస్పెన్షన్

మరో ఇద్దరు హోంగార్డులు...

వ్యభిచార గృహం నుంచి మామూళ్లే కారణం?

అనంతపురం క్రైం, జూన్12(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓ వ్యభిచార గృహనిర్వహణలో మామూళ్లు వసూలు చేశారన్న ఆరోపణలపై ఓ కానిస్టేబుల్, ఇద్దరు హోంగార్డులను సస్పెండ్ చేశారు. నాలుగు రోజుల కిందట వెలుగు చూసిన వ్యవహారంలో తాజాగా జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ చంద్రశేఖర్, హోంగార్డులు మధు, సోముపై చర్యలు తీసుకున్నారు.

ప్రతి వారం మామూళ్లు ఇవ్వాల్సిందే

నగరంలోని రెండో రోడ్డులో వ్యభిచార గృహం నిర్వహిస్తున్నారు. అక్కడ ఓ మహిళ ఆధ్వర్యంలోనే ఆ గృహం నడుస్తోంది. అక్కడ సంబంధిత కానిస్టేబుల్, ఇద్దరు హోంగార్డులు ప్రతి వారం మామూళ్లు పుచ్చుకుంటున్నట్లు తెలిసింది. ఇదంతా ఒక ఎత్తయితే ఆ గృహంలో వీరి పాత్ర కీలకని సమాచారం. కొత్తగా తీసుకొచ్చే అమ్మాయిలు మొదట ఈ ముగ్గురితో కలవాలట. నాలుగు రోజుల క్రితం డయల్-100కు వచ్చిన ఫిర్యాదు ఆధారంగా త్రీటౌన్ పోలీసులు ఆ వ్యభిచార గృహంపై దాడులు నిర్వహించారు. ఆ సమయంలో నిర్వాహకురాలిని అరెస్ట్ చేశారు.

విచారణలో బట్టబయలు

నిర్వాహకురాలిని ఓ పోలీస్ ఉన్నతాధికారి విచారించారు. అందులో కొన్ని ఆసక్తికర విషయాలు వెలుగుచూసినట్లు తెలిసింది. త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేసే కానిస్టేబుల్, ఇద్దరు హోంగార్డుల తీసుకునే ముడుపులు, కొత్తగా వచ్చేవారికి మొదటి విటులు వాళ్లేనని చెప్పినట్లు సమాచారం. ఆ మేరకు ఫోన్‌పేలలో పంపిన డబ్బు రుజువులతో చూపినట్లు తెలిసింది. దీంతో ఆ ముగ్గురినీ సస్పెండ్ చేస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. వ్యభిచార గృహం నిర్వహణ, పైసా మామూళ్లు ఆ పోలీస్‌స్టేషన్‌లో పై అధికారులకు తెలియకుండానే జరుగుంతోందా..? అనే సందేహం వ్యక్తమవుతోంది.

ఇద్దరు పిల్లలు సహా మహిళ అదృశ్యం

ఉరవకొండ,జూన్12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రంగావీధికి చెందిన షాహినా అనే మహిళ తన ఇద్దరు పిల్లలతో సహా కనబడడం లేదు. ఆమె తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. రంగావీధిలో నివాసముంటున్న షాహినా తన ఆరేళ్ల కుమారుడు, మూడేళ్ల కుమార్తెతో పాటు గురువారం మధ్యాహ్నం నుంచి కనబడడం లేదని ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారి ఆచూకి ఎవరికైనా తెలిస్తే పోలీసులకు సమాచారమివ్వాలని సీఐ మహానంది తెలిపారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి

పెనుకొండ రూరల్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని మరువపల్లి వద్ద రైల్వే ట్రాక్ దాటుతుండగా రైలు ఢీకొని రాజశేఖర్ (32) అనే వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మరువపల్లికి చెందిన రాజశేఖర్ గ్రామ సమీపంలో రైల్వే ట్రాక్ దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య లీలావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. టీడీపీ నాయకుడు వెంకటేశ్వరరావు పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని మృతదేహాన్ని సందర్శించారు. అంత్యక్రియలకు రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు.

రెండు వ్యభిచార గృహాలపై దాడి

అనంతపురం క్రైం,జూన్12(ఆంధ్రజ్యోతి) : నగరంలోని హౌసింగ్‌బోర్డులో రెండు వేర్వేరు వ్యభిచార గృహాలపై టూటౌన్ పోలీసులు దాడులు నిర్వహించారు. గురువారం టూటౌన్ సీఐ శ్రీకాంత్‌కు అందిన సమాచారం మేరకు... హౌసింగ్‌బోర్డులోని ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడులు నిర్వహించారు. నిర్వాహకులు రామాజీ మేరి సుజాత, సరస్వతితో పాటు విటులను అరెస్ట్ చేశారు. అనంతరం అదే ప్రాంతంలోని మరో ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్న లక్ష్మి, వనిత, వంశీ, అశోక్‌ను అరెస్ట్ చేశారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

రామగిరి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరూరు డ్యాంకు చెందిన ఆదిలక్ష్మి(54) అనే మహిళ గురువారం విద్యుదాఘాతంతో మృతి చెందింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఆదిలక్ష్మి కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేది. ఇంటి వద్ద మోటారు వేయడానికి స్విచ్ వేస్తుండగా విద్యుత్ షాక్‌గురై అక్కడికక్కడే మృతిచెందింది. విషయం తెలుసుకున్న రామగిరి పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఆదిలక్ష్మికి కుమారుడు ఉన్నారు.

చెరువులో దూకి మహిళ ఆత్మహత్య

ధర్మవరం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గూడ్స్‌షెడ్ కొట్టాలకు చెందిన మల్లికార్జున భార్య ఈశ్వరమ్మ(45) ధర్మవరం చెరువు ఒకటో మరువ వద్ద చెరువులోకి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు, వన్‌టౌన్ పోలీసులు తెలిపిన మేరకు.. పట్టణంలోని గూడ్స్‌షెడ్ కొట్టాలకు చెందిన ఈశ్వరమ్మ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేది. ఆమె ఒకటో మరువ వద్ద చెరువులోకి దూకి ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు చెరువులో మహిళ శవాన్ని చూసి సమాచారం ఇవ్వడంతో పోలీసులు బయటకు తీయించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మహిళ ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. మృతురాలికి భర్తతోపాటు ముగ్గురు కుమారులు ఉన్నారు.

ఊరూరా విజయోత్సవాలు


ధర్మవరంలోని టీడీపీ కార్యాలయం వద్ద కేక్‌కట్ చేస్తున్న నాయకులు

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధిలో పరుగులు పెడుతోందని ఏపీసీడ్స్ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ కమతం కాటమయ్య, పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్‌తో పలువురు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా గురువారం వారు విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. ఇందులో భాగంగా ధర్మవరం పట్టణంలోని గాంధీనగర్‌లో ఉన్న టీడీపీ కార్యాల యం ఎదుట ఆ పార్టీ నాయకులు కేక్‌కట్ చేసి విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. అలాగే మండలకేంద్రమైన ముదిగుబ్బలో బస్టాండ్ కూడలిలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కార్యకర్తల సమక్షం లో నాయకులు కేక్ కట్‌చేశారు. కదిరి పట్టణంలోని ఆర్ అండ్‌బీ బంగ్లాలో విజయోత్సవాలు నిర్వహించారు. అలాగే నియోజకవర్గంలోని తలుపుల, నల్లచెరువు, నల్లమాడ, నంబులపూలకుంట, ఓబుళదేవరచెరువు తనకల్లు మండలకేంద్రాల్లో, తనకల్లు మండలంలోని కొక్కంటి క్రాస్‌లో విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. పలుచోట్ల ర్యాలీలు నిర్వహించారు.


ముదిగుబ్బలో కేక్ కట్‌చేస్తున్న టీడీపీ నాయకులు


నల్లచెరువులో...


నల్లమాడలో...


నంబులపూలకుంటలో...


ఓబుళదేవరచెరువులో...

విజయోత్సవ ర్యాలీ రేపటికి వాయిదా

పుట్టపర్తి రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): పుట్టపర్తిలో శుక్రవారం జరగాల్సిన విజయోత్సవ ర్యాలీని,అహమ్మదాబాద్‌లో విమాన ప్రమాదం కారణంగా వాయిదా వేస్తున్నట్లు ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డిలు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం టీడీపీతోపాటు మిత్రపక్షాలైన జనసేన, బీజేపీ నాయకులతో కలసి విజయోత్సవ సంబరాలు నిర్వహిస్తామన్నారు. ర్యాలీ ఉదయం 10.30 గంటలకు సత్యమ్మ గుడి వద్ద ప్రారంభమై ఆర్టీసీ బస్టాండ్ మీదుగా ఈశ్వరమ్మ పాఠశాల వరకు సాగుతుందన్నారు, నియోజకవర్గంలోని టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొనాలని ఎమ్మెల్యే, మాజీ మంత్రి పల్లె పిలుపునిచ్చారు.

షైనింగ్ స్టార్స్‌కు సన్మానం

నంబులపూకుంట, జూన్ 12(ఆంధ్రజ్యోతి): షైనింగ్ స్టార్ అవార్డు ఎంపికైన విద్యార్థులను మండలంలోని గూటిబైలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు శాంతమ్మ గురువారం సన్మానించారు. విద్యార్థులు జగన్మోహన్‌నాయుడు, పాండురంగనాయుడు, షాహీనాను సన్మానించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పారిశ్రామిక ప్రాంతంలో అక్రమ కట్టడాలు

● చోద్యంచూస్తున్న అధికారులు


అక్రమంగా నిర్మిస్తున్న భవనం

కదిరిఅర్బన్,జూన్12(ఆంధ్రజ్యోతి): రూరల్ పరిధిలోని కుమ్మరవాండ్లపల్లి పారిశ్రామిక ప్రాంతంలో అక్రమ కట్టడాలు వెలుస్తున్నాయి. గతంలో ఇక్కడ అక్రమ కట్టడాలు కడుతున్నట్లు స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వాటిని అధికారులు పరిశీలించి, అప్పుడు కూల్చి వేశారు. అక్రమణదారులు అదే ప్రాంతంలో అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నా, సంబంధితాధికారులు చోద్యం చూస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అక్కడ నిర్మించిన అక్రమ కట్టడాలను ఇటీవల ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఏపీఐఐసీ ఛైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. పారిశ్రామిక ప్రాంతంలో చిన్నచిన్నపరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులిస్తోంది. కానీ కొంతమంది ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు లేకుండా ఫంక్షన్‌హాళ్లు కడుతున్నారు. దీనిపై ఏపీఐఐసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, అక్రమ కట్టడాలను గుర్తించి, వారిని నోటీలిచ్చామనితెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

కంకర పరిచి.. తారు మరిచారు..

● వేంపల్లి రోడ్డులో ప్రయాణం నరకప్రాయం
● ఆందోళన వ్యక్తం చేస్తున్న వాహనదారులు


కంకర పరిచి వదిలేసిన వేంపల్లిరోడ్డు

నంబులపూలకుంట, జూన్ 12(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ పాలనలో డబుల్ రోడ్డు మంజూరైందని... వేంపల్లి సింగిల్ తారురోడ్డును తొలగించి కంకర పరిచారు. ఆ తర్వాత తారు వేయడం మరిచారు. మండలకేంద్రానికి దాదాపు ఒక టిన్నర కిలోమీటర్ల దూరంలో ఉన్న జంక్షన్‌లో కొత్తరోడ్డు నుంచి ఆశ్రమవారిపల్లి వరకు పది కిలోమీటర్ల మేర ఇలానే ఉంటుంది. దీంతో ఆ మార్గంలో వెళ్లాలంటే పలు గ్రామాల ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలకేంద్రానికి సమీపంలోని కదిరి, రాయచోటి ప్రధాన రహదారి కొత్తరోడ్డు నుంచి వేపంల్లిరోడ్డు పనులను 2023లో ప్రారంభించారు. రూ. 17కోట్ల వ్యయంతో చేపట్టిన డబుల్ రోడ్డు పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో, రోడ్డుపైన పరిచిన కంకర మాత్రమే మిగిలింది. ఈ మార్గం గుండా ఉన్న ఎర్రవంకలవారిపల్లి, మరికొమ్మదిన్నె, జౌకల, ఆశ్రమవారిపల్లి గ్రామాల్లో మాత్రమే సీసీరోడ్లు పూర్తి చేశారు. కానీ కొత్తరోడ్డు నుంచి వేపంల్లి రోడ్డు పనులను కంకర పరచడంతోనే నిలిపివేవారు. ఈ మార్గంలో కల్వర్టుల నిర్మాణం పనులను కూడా హడావుడిగా ముగించారు. దీంతో ఈ మార్గంపై ప్రయాణించేందుకు వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. భయాందోళనతో ప్రయాణం కొనసాగించాల్సి వస్తోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ద్విచక్రవాహన దారులు అదుపు తప్పి కిందపడిన సంఘటనలు అనేకమున్నాయి. దీనికితోడు రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. భారీ వాహనాలు ఈదారి గుండా వెళుతున్నపుడు భారీగా దుమ్ముధూళి చెలరేగుతుంది. దీంతో వెనుక వచ్చే వాహనదారులకు దారి కనిపించదు. ఈ రహదారి గుండా వెళ్లేటప్పుడు ప్రతిక్షణం అప్రమత్తంగా వాహనం నడపకపోతే ఏ సమయంలో ప్రమాదం చేటుచేసుకుంటుందో తెలియదని ప్రయాణికులు అంటున్నారు. హడావుడిగా పనులు చేశారే కానీ, రోడ్డు ఎందుకు పూర్తి చేయలేదో అర్థం కావడంలేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. గతంలో ఉన్న సింగల్ రోడ్డుపై సురక్షితంగా గమ్యం చేరే వాళ్లమని, ఈ రోడ్డు పనులు ప్రారంభించినప్పటి నుంచి ప్రతిరోజు ప్రయాణం నరకప్రాయంగా ఉందంటున్నారు. మండల వాసులు, వేంపల్లి, పులివెందల, తలుపుల ప్రాంతాలకు వెళ్లేందుకు ఈ మార్గం చాలా దగ్గర. మండల వాసులు నిత్యం ఈ రహదారిగుండానే వివిధ ప్రాంతాలకు వెళ్తుంటారు. త్వరగా రోడ్డు పనులను పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మరువ పారిందంటే రాకపోకలు బంద్

మండలపరిధిలోని మరికొమ్మెదిన్నె గ్రామ సమీపంలో వేంపల్లి రోడ్డులో గుండా ఓ బ్రిడ్జి ఉంది. ఎగువనున్న వంకమద్ది చెరువు నిండి మరవ పారితే ఈ బ్రిడ్జి గుండా సేరే డు చెరువుకు నీరు చేరుతుంది. మరవ నీరు ఎక్కువగా పారితే బ్రిడ్జిపైన రాకపోకలు నిలిచిపోతాయి, ఆ బ్రిడ్జి కూడా దెబ్బతింది. బ్రిడ్జి పనులు పూర్తికాకపోతే, రాకపోకలు పూర్తిగా నిలిచిపోయే ప్రమాదముంది. ఈ యేడాది వర్షాలు ఎక్కువగా వస్తాయని, శాస్త్రవేత్తలు చెబుతున్నారు. వంకమద్ది చెరువు నిండితో ఈ రహదారి గుండా వెళ్లే గ్రామాలకు రాకపోకలుండవు.

రోడ్డు పనులు పూర్తి చేయాలి



వేంపల్లి రోడ్డుపై మండలంలోని ఆశ్రమవారిపల్లి వరకు కంకర పరిచి వదిలేశారు. ఆ రోడ్డుపై వెళ్లాలంటే చాలా ఇబ్బందిగా ఉంది. ఎప్పుడు ప్రమాదాలు జరగుతాయో అని భయంభయంగా వెళ్లాల్సి వస్తోంది. ఎదురుగా వాహనాలు వస్తే ద్విచక్రవాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భారీ వాహనాలు వస్తే వాటి వెనుక వెళుతున్న వాహనదారులకు దారి కనిపించదు. వెంటనే ప్రభుత్వం స్పందించి ఈరోడ్డు పనులు పూర్తి చేయాలి.

-రంగారెడ్డి, ఎర్రవంకలవారిపల్లి

ప్రయాణం ఇబ్బందిగా ఉంది



రెండేళ్ల క్రితం హడావుడిగా మండలంలోని ఆశ్రమవారిపల్లి వరకు వేంపల్లి డబుల్ రోడ్డు పనులు ప్రారంభించారు. కంకర పరిచి వదిలేశారు. దీతో ఈ రోడ్డుగుండా ప్రయాణం ఇబ్బందిగా ఉంది. వివిధ పనుల నిమిత్తం నిత్యం మండలకేంద్రానికి వెళ్తుంటాం. ఈ రోడ్డు గుండానే వెళ్లాల్సి ఉంది. రాత్రిళ్లు ప్రయాణం మరింత కష్టతరంగా ఉంటుంది. ఎదురుగా వాహనం వస్తే మరో వాహనం నిలపాల్సిందే. లేకపోతే ఏరాయి వచ్చి ఎక్కడ పడుతుందో అర్థం కాదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈరోడ్డు పనులు పూర్తి చేయాలి.

- వెంకటరమణ, మరికొమ్మెదిన్నె గ్రామం

మహిళా సంక్షేమానికి కృషి చేయండి

● ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి

పుట్టపర్తి రూరల్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): మహిళా సంక్షేమం, అభివృద్ధికి దోహదపడాలని ఎమ్మెల్యే పల్లె సిందూరరెడ్డి పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) అధికారులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్ వద్ద మెప్మా జిల్లా కార్యాల యాన్ని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి గురువారం ఉమ్మడి జిల్లా మెప్మా పీడీ విశ్వజ్యోతి, సత్యసాయి జిల్లా ప్రాజెక్టు నూతన పీడీ పద్మావతితో కలసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం మహిళలకోసం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అధికారులకు, మహిళా సంఘాలకు సూచించారు. మహిళా సాధికారత కోసం సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఎంతో కృషి చేస్తున్నారన్నారు. అనంతరం ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణంలోని ఐసీడీఎస్ కార్యాలయం, జిల్లా ట్రెజరీ కార్యాలయాన్ని సందర్శించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, టీఈ భవాని, మెప్మా అధికారులు శ్రీనివాసరెడ్డి, సీఎంఎం రమాదేవి, మున్సిపల్ మేనేజర్ లక్ష్మీదేవమ్మ, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు రామాంజినేయులు, విజయ్‌కుమార్, రామ్‌లక్ష్మణులు, సామకోటి, గంగాధర్ నాయుడు, లాయర్ హరికృష్ణ, సూర్యనారాయణ, అబ్దుల్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


మెప్మా పీడీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

వేరుశనగ విత్తనకాయల పంపిణీ


బుక్కపట్నంలో విత్తనకాయలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

బుక్కపట్నం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): రైతుల కోసం ప్రభుత్వం సరఫరా చేస్తున్న సబ్సిడీ వేరుశనగ విత్తనకాయలను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. మండలకేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో గురువారం విత్తనకాయలను వారు అధికారులతో కలిసి పంపిణీచేశారు. కురబ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, టీడీపీ టౌన్ కన్వీనర్ జంగం వెంకటరాముడు, తెలుగు మహిళలు యశోద, లావణ్యగౌడ్, మాజీ ఎంపీపీ బాలు, అక్కులప్ప, ఎర్రకేశి, మంజు, రామాంజి, శేఖర్, ఏఓ మహిత, రైతు సేవాకేంద్రం సిబ్బంది గంగాధర్, సుధాకర్‌నాయక్, తదితరుల పాల్గొన్నారు.

● బత్తలపల్లి: మండలవ్యాప్తంగా అన్ని రైతు సేవా కేంద్రల్లో గురువారం వేరుశనగ విత్తన కాయల పంపిణీ ప్రారంభించినట్లు ఏఓ ఓబిరెడ్డి తెలిపారు. ఖరీఫ్‌లో వేరుశనగ సాగుకు కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రలలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. టీడీపీ మండల కన్వీనర్ నారాయణరెడ్డి, రమణ,శ్రీరాములు, అశోక్, అప్పస్వామి, రాజు తదితరులు పాల్గొన్నరు.

●ధర్మవరం రూరల్: ప్రభుత్వం అందించే సబ్సిడీ విత్తన వేరుశనగ కాయలను గురువారం మండలంలోని ధర్మపురి గ్రామ రైతు సేవా కేంద్రం వద టీడీపీ నాయకులు పంపిణీ చేశారు. టీడీపీ రాష్ట్ర తెలుగు యువత అధికారప్రతినిధి విజయ్‌చౌదరి, ఆ పార్టీ నాయకులు, అధికారులతో కలిసి రైతులకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అమరసుధాకర్, బీజేపీ మండల మాజీ కన్వీనర్ భక్తవత్సల నాయుడు, రైతుసేవాకేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

కలప అక్రమ రవాణా


వాహనంలో కలపను తరలిస్తున్న దృశ్యం

కొత్తచెరువు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి, బుక్కపట్నం, కొత్తచెరువు మండలాల గుండా కలప అక్రమ రవాణా విచ్చలవిడిగా సాగుతోంది. కొందరు వ్యాపారులు రైతుల వద్ద చెట్లను కొనుగోలు చేసి వాటిని నరికివేస్తున్నారు. వాటి కలపను వాహనాలలో నింపి, టార్పాల్ పట్లను కప్పి గుట్టుచప్పుడు కాకుండా సామిల్లులకు తరలిస్తున్నారు. జిల్లా అటవీశాఖ కార్యాలయం సమీపంలోనే ఇదంటా జరుగుతున్నా ఆ శాఖ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఒక పక్క ప్రభుత్వం 'మొక్కలు నాటాలి... పర్యావరణాన్ని పరిరక్షించాలి', 'చెట్లను కొడితే కఠిన చర్యలు' అని హెచ్చరిస్తోంది. అయితే అటవీ అధికారులు అవేవీ పట్టించుకోకుండా మామూళ్లకు లోబడి కలప అక్రమ రవాణా చేసే వారితో చేతులు కలిపి ఈ దందాకు సహకరిస్తున్నారని పర్యావరణ వేత్త భాస్కర్ నా యుడు వాపోయారు. ఈ విషయంపై పలుమార్లు అటవీ అధికారు లు, ప్రజాప్రతినిధులకు తెలిపినా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి, చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

నల్లమాడ, జూన్12(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన నలుగురిపై ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదుచేసినట్లు పోలీసులు గురువా రం తెలిపారు. నల్లమాడకు చెందిన హనుమంతరెడ్డి, ఓంకార్, చంద్ర, చరణ్ అనే నలుగురు తనను కులం పేరుతో దూషించి, తనపై దాడికి పాల్పడ్డారని బుక్కపట్నం మండలం మరాల గ్రామానికి చెందిన కిషోర్ ఫిర్యాదు చేశారన్నారు. కిషోర్ ఫిర్యాదు మేరకు ఆ నలుగురిపై కేసు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు.

విద్యామిత్ర కిట్ల పంపిణీ


చిగిచెర్లలో విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్న జడ్పీ మాజీ చైర్మన్ ఓబిరెడ్డి

ధర్మవరం రూరల్, జూన్12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు గురువారం పునఃప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం అందజేస్తున్న సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా మిత్ర కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ధర్మవరం రూరల్ మండలంలోని చిగిచెర్ల గ్రామ జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యా కిట్ల పంపిణీ కార్యక్రమానికి జడ్పీ మాజీ చైర్మన్ ఓబిరెడ్డి హాజరై విద్యార్థులకు విద్యాసామాగ్రి అందజేశారు. విద్యార్థులు క్రమశిక్షణను అలవర్చుకుని చదువుకుంటే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ శీలా ఆనంద్, హెచ్‌ఎం తిమ్మారెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

● ధర్మవరం: విద్యారంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం కొత్త దిశగా తీసుకెళ్తోందని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర పథకం కింద గురువారం పట్టణంలోని కొత్తపేట ప్రభుత్వ బాలికల ఉన్నతపాఠశాలలో విద్యార్థులకు విద్యా సామాగ్రిని ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ1-రాజేశ్వరి, ఎంఈఓ-2 గోపాల్‌నాయక్, పాఠశాల హెచ్‌ఎం మేరి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

● తనకల్లు : మండలపరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు గురువారం పునఃప్రారంభమయ్యాయి. తననకల్లు ఉన్నతపాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఎస్ఎం ఖాదర్‌వలి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు వెంకటాచలపతి, రెడ్డినాగయ్య సర్వేపల్లి రాధక్రిష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకా నికి ప్రభుత్వం నాణ్యమైన సన్నబియ్యం సరపరా చేసిందని తెలిపారు. ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ చైర్మన్ రవిచంద్ర, సభ్యులు సాహీర్‌బావా, డీలర్ సునిల్; ఫక్కీర్‌సాబ్, టీడీపీ నాయకుడు దస్తగిరి పాల్గొన్నారు.

● బత్తలపల్లి: మండలవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలలు గురువారం ప్రారంభమయ్యాయి. ఏప్రిల్ 24న పాఠశాలలకు వేవి సెలవులు రావడంతో మూతపడ్డాయి. సెలవులు ముగియడంతో తిరిగి ప్రారంభమయ్యాయి. మండల వ్యాప్తంగా 32 ప్రాథమిక పాఠశాలలు, ఐదు ప్రాథమికోన్నత, ఆరు ఉన్నత పాఠశాలలు తెరుచుకున్నాయి. మొదటి రోజు విద్యారులు పాఠశాలలకు పెద్దగా హాజరు కాలేదు.

జోరు వాన


బడన్నపల్లి వద్ద చేనులో నిలిచిన వర్షపునీరు

ధర్మవరం రూరల్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): మండలవ్యాప్తంగా రెండురోజులుగా ఎడతెరపలేకుండా జోరువాన కురుస్తోంది. బుధవారం రాత్రి నుంచి వర్షం కురుస్తుండడంతో చేనులు, వాగులు, వంకలలో నీరు పారుతోంది. మృగశిరకార్తెలో వర్షం కురుస్తుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్తెలో వర్షం కురిస్తే పంటలకు అనుకూలంగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. తొలి ముంగారులో కురిసిన వర్షానికి రైతులు పొలాలను దున్ని దుక్కిచేశారు. అదేవిధంగా ప్రస్తుత ప్రభుత్వం కూడా వేరుశనగ విత్తన కాయలను పంపిణీ చేస్తోంది. ఈ వర్షానికే పలుగ్రామాల్లో రైతులు వేరుశనగ, కంది సాగుచేసేందుకు సిద్ధం అవుతున్నట్లు రైతులు తెలుపుతున్నారు. ముందస్తుగా వర్షాలు కురుస్తుండటంతో ముందుగానే పంటలు సాగుచేస్తే అనుకూలంగా పండుతున్నాయని పలువురు రైతులు అభిప్రాయపడుతున్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీఓగా రామూనాయక్

తనకల్లు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): మండల ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా రామూనాయక్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న మమతాదేవి బదిలీపై నార్పలకు వెళ్లారు. తలుపుల మండలం ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా పనిచేస్తున్న రామూనాయక్‌ను తనకల్లు ఏఓగా బదిలీ చేసి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ బాధ్యతలు అప్పగించారు. బాధ్యతలు చేపట్టిన ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రతినిధుల సహకారంతో మండలాన్ని అభివృద్ధి చేస్తామన్నారు.

'బాలకార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం'



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కదిరి లీగల్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): బడిలో ఉండాల్సిన పిల్లలు బాల కార్మికుల్లాగా మారకూడదని సహాయ కార్మిక శాఖాధికారి జహీరుద్దీన్ అన్నారు. ప్రపంచ బాల కార్మికుల వ్యతిరేక దినోత్స వం సందర్భంగా గురువారం కదిరి పట్టణంలోని నిజాంవలి కాలనీ కార్మిక ఏరియాలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మండల న్యాయ సేవాధికార సంస్థ, సమత ఎన్జీఓల ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా సహాయ కార్మిక శాఖాధికారి మాట్లాడుతూ... తల్లిదండ్రులు పిల్లలను చదివించి, వారి భవిష్యత్తుకు బాట వేయాలన్నారు. కానీ బాల కార్మికులుగా మార్చి వారి భవిష్యత్తును పాడు చేయకూడదన్నారు. చదివించలేని తల్లిదండ్రులు ఆ విషయాలను కార్మిక శాఖ దృష్టికి తీసుకొస్తే, వారి చదువుకు అవసరమైన చర్యలు చేపడుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రెడ్స్ సంస్థ ప్రతినిధులు ఎల్లప్ప, మెహతాజ్, అమ్మజాన్, సమత సభ్యులు ఉమామహేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్‌నాయుడు పాల్గొన్నారు.

ఘనంగా వృద్ధాశ్రమ వార్షికోత్సవం

అమడగూరు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని గాజులవారిపల్లి వద్ద వెలసిన శ్రీమాతృశ్రీ వృద్ధాశ్రమం ఐదో వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. దాతలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. వృద్ధుల సమక్షంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. వృద్ధులను కుటుంబ సభ్యులుగా భావించి సేవలందిస్తున్న ఆశ్రమ నిర్వాహకు రాలు అరుణజ్యోతిని అభినందించారు.

పారిశుధ్య కార్మికులకు పనిముట్ల పంపిణీ

గాండ్లపెంట, జూన్ 12(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం డీఎల్‌పీఓ ఆంజనప్ప పారిశుధ్య కార్మికులకు పనిముట్లను పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా 14 పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు అవసర మైన గ్లౌజులు, పనిముట్లు, కిట్లు అందజేశారు. ఎంపీడీఓ వెంటరామిరెడ్డి, ఈఓ ఆర్డీ సునీత, సీఐటీయూ నాయకుడు సాంబశివ, రైతు సంఘం నాయకుడు రాజారెడ్డి పాల్గొన్నారు.

విద్యతోపాటు పౌష్టికాహారం: సీడీపీఓ

కదిరిఅర్బన్, జూన్12 (ఆంధ్రజ్యోతి): చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్య, పౌష్టికాహారం అందివ్వడమే అంగన్‌వాడీ కేంద్రాల లక్ష్యమని కదిరి సీడీపీఓ రాధిక పేర్కొన్నారు. పట్టణంలోని గొల్లమ్మ మండపం సెక్టారు పరిధిలోని కుటాగుళ్ల అంగన్‌వాడీ కేంద్రం -2లో గురువారం సామూహిక అక్షరాభ్యాసం, అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ... ముందస్తుగా చిన్నారులను బడికి వెళ్లేందుకు మానసికంగా సిద్ధం చేస్తామని తెలిపారు. అనంతరం అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమం ర్యాలీ నిర్వహించి, చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు లక్ష్మి, మమత, ఇందిరా, కార్యకర్తలు రామలక్ష్మి, సుజాత, శాంతి, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

'అంగన్‌వాడీ పిలుస్తోంది'

నంబులపూలకుంట, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం -1 ఆధ్వర్యంలో గురువారం అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఐసీడీఎస్ అధికారులు చిన్నారులు న్న ఇళ్ల వద్దకు వెళ్లి మీపిల్లల బంగారు భవిష్యత్ కోసం ఫీజులు లేని అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పాలని తల్లిదండ్రులకు సూచించారు. నాలుగు సంవత్సరాలలోపు చిన్నా రుల తల్లిదండ్రులకు అంగన్‌వాడీ గురించి వివరించారు. ప్రతిరోజు ఉడికించిన గుడ్డు, వంద మిల్లీలీటర్ల పాలు, మధ్యాహ్నం భోజనం అందిస్తామ న్నారు. ఆరోగ్యసూత్రాల గురించి అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

సుభిక్ష పాలనకు ఏడాది

కూటమి నాయకుల సంబరాలు

హిందూపురం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అరాచక పాలన అంతమై సుభిక్ష పాలన మొదలై ఏడాది అయిన సందర్భంగా గురువారం కూటమి నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు నాలుగు సింహాల ఎన్టీఆర్ విగ్రహం వద్ద బాణాసంచా పేల్చి మిఠాయిలు పంచారు. కేక్‌కట్‌చేసి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ అరాచక పాలనకు చరమగీతంపాడి కూటమికి అధికారం ఇచ్చి పగ్గాలు చేతబట్టి గురువారానికి ఏడాదైందన్నారు. అధోగతి పాలనలో ఉన్న రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అభివృద్ధివైపు నడిపిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రమేష్, టీడీపీ జిల్లా అధ్యక్షులు అంజినప్ప, పట్టణ కన్వీనర్ వెంకటేశ్, నాయకులు నాగరాజు, రాఘవేంద్ర, శివశంకర్, శషీ రవీంద్రనాయుడు, అమర్నాథ్, తిమ్మయ్య, అమీన్, టైలర్ గంగాధర్, కోరుముట్ల నాగేంద్ర, జనసేన ఉమేష్, బీజేపీ ఆదర్శ్ జనసేన షేఖర్, రాము, సుమోశీన పాల్గొన్నారు.
తూమకుంటలో... రూరల్ మండల నాయకులు తూమకుంట చెక్‌పోస్టులో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డ్ చైర్మన్ అశ్వర్థనారాయణరెడ్డి, మండల కన్వీనర్ రాము, ఉమాశంకర్‌రెడ్డి, సాకే ఆంజనేయులు, నాయకులు ఆదినారాయణ, చిక్కీరప్ప, రామక్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.
పెనుకొండ టౌన్, (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అభివృద్ధి పరుగుతు పెడుతోందని టీడీపీ నేత వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయిన సందర్భంగా కేక్‌కట్ చేసి నాయకులకు పంచిపెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో మంత్రి సవిత ఆధ్వర్యంలో అభివృద్ధి, సంక్షేమ జరుగుతోందన్నారు. రాబోవు రోజుల్లో మరింత అభివృద్ధి చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ శ్రీరాములు, ప్రసాద్, గుట్బూరు నాగరాజు, యువనాయకుడు త్రివేంద్ర, రఘు, రమణమ్మ, రామలింగ, వడ్డె గోవిందు పాల్గొన్నారు.



తూమకుంట చెక్‌పోస్టులో కేక్ కట్‌చేస్తున్న రూరల్ మండల నాయకులు


పెనుకొండలో టీడీపీ నేత వెంకటేశ్వరరావు, నాయకులు


రొళ్లలో...


మడకశిరలో...


గోరంట్లలో...

అంగన్‌వాడీ కేంద్రాల్లో అక్షరాభ్యాసం

మడకశిర రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నీ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. కల్లుమర్రి అంగన్‌వాడీ కేంద్రంలో స్థానిక సర్పంచు గంగమ్మ, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి నాగరాజు, సీడీపీఓ నాగమల్లేశ్వరి అక్షరాభ్యాసం చేయించారు.
అగళి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం సూపర్‌వైజర్ లీలావతి ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు.

విద్యాకిట్ల పంపిణీ

పరిగి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు విద్యాకిట్లను ఎంఈఓ లక్ష్మీదేవి అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కృపాసత్యరాజ్, స్కూల్ కమిటీ చైర్మన్ అశ్వర్థ, ఉపాధ్యాయులు పీఈటీ వినోద్, విద్యార్థులు పాల్గొన్నారు.
రొళ్ల, (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని పాఠశాలలకు విద్యార్థి మిత్ర కిట్లను గురువారం పంపిణీ చేశారు.

మధ్యాహ్న భోజన బియ్యం పరిశీలన

మండలంలో జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో సన్నబియ్యం నాణ్యతను ఎంఈఓ గురువారం పరిశీలించారు. భోజన నిర్వాహకులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

తల్లికి చిన్నారి అప్పగింత

హిందూపురం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన షబానా(10)కి ఐస్క్రీం, చాక్లెట్ ఇప్పిస్తానని నమ్మించి ఓ వ్యక్తి కర్ణాటకలోని నగరిగెరకు తీసుకెళ్లాడు. అక్కడ వైన్‌షాపువద్ద చిన్నారి ఉంది. గమనించిన లేపాక్షికి చెందిన ఆటోడ్రైవర్ చిన్నారితో మాట్లాడి లేపాక్షికి తీసుకువచ్చి పాన్‌షాపునకు చెందిన బాబాకు విషయాన్ని వివరించాడు. బాబా సమాచారాన్ని హిందూపురానికి చెందిన అల్‌ఇందాద్ చారిటబుల్ ట్రస్ట్‌సభ్యులు అమాన్, సాదిక్, రిహాన్‌బాబా, ఫక్రుద్దీన్‌లకు చేరవేశాడు. వారు వెంటనే లేపాక్షికి వెళ్లి చిన్నారి తల్లిని అక్కడకు పిలిపించి అప్పగించారు. చిన్నారిని ఎవరు తీసుకెళ్లారన్నది ఇంకా తెలియాల్సి ఉంది.


చిన్నారిని తల్లికి అప్పగిస్తున్న అల్‌ఇందాద్ చారిటబుల్ ట్రస్టు సభ్యులు

అనువుగాని చోట ఇళ్ల నిర్మాణం

ఓ వైపు శ్మశానం.. మరోవైపు డంపింగ్‌యార్డు
వైసీపీ ప్రభుత్వ నిర్వాకం
ఇళ్లు కట్టేందుకు, చేరేందుకు.
ఆసక్తి చూపని లబ్ధిదారులు


నిర్మానుష్యంగా కాలనీ


కాలనీ పక్కనే సమాధులు, డంపింగ్‌యార్డు

గోరంట్ల, జూన్11 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం అనాలోచితంగా అనువుగాని ప్రదేశంలో ఇళ్ల నిర్మాణాలకు అనుమతులిచ్చింది. అవి పూర్తి అయినా ఇళ్లలోతాము ఉండలేమంటూ లబ్ధిదారులు చెబుతున్నారు. గోరంట్ల మండలకేంద్రంలో ఈ పరిస్థితి నెలకొంది. గోరంట్ల ప్రజలకు హిందూ శ్మశానవాటికి స్థలం కోసం అప్పటి టీడీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యే పార్థసారథి ఎములగుట్లపల్లి వద్ద 4.25 ఎకరాల స్థలాన్ని పరిశీలించి ప్రతిపాదించారు. దీంతో శ్మశానవాటికి సమస్య పరిష్కారమైందని అందరూ ఆశించారు. అయితే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సర్వేనెంబర్ 581-2లోని 1.50 ఎకరాలను శ్మశానానికి వదిలి, కదిరి ప్రధాన రహదారి పక్కన ఉన్న సర్వేనెంబర్ 579-1లోని 2.75 ఎకరాలను ఇళ్లకాలనీ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కరోనా రావడంతో ప్రతిపాదిత స్థలంలో మృతిచెందినవారిని పంచాయతీ సిబ్బంది ఖననం చేశారు. 2019-20లో లేఅవుట్లో 70 ప్లాట్లు వేసి, 61 మందికి పట్టాలిచ్చి ఇళ్లు మంజూరు చేశారు. సమాధుల సంఖ్య రోజురోజుకు పెరగడంతో లబ్ధిదారుల్లో ఆందోళన మొదలైంది. శ్మశాన స్థలంలోనే పట్టణంలోని చెత్తాచెదారం, వ్యర్థపదార్థాలను డంపింగ్‌చేశారు. దీంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేశారు. మొదట్లో ఇళ్ల నిర్మాణాలకు ఆసక్తి చూపిన లబ్ధిదారులు ఇళ్ల దగ్గర శ్మశానవాటిక, చెత్తకుప్పలుండడంతో నిర్మాణాలంటేనే వ్యతిరేకించారు. నిర్మాణాలు పూర్తి చేయాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నా కట్టుకోవడానికి ఆసక్తి చూపడంలేదు. తాగునీటి సౌకర్యం, నీటి ట్యాంక్, విద్యుత్ సౌకర్యం కల్పించినా లబ్ధిదారుల్లో మార్పురాలేదు. ప్రస్తుతం 61ఇళ్లలో 9 బిబిఎల్, 26 బెసిమెంట్ లెవల్, 12 పైకప్పువేయగా, 14 ఇళ్ల నిర్మాణం పూర్తి అయింది. చాలా కాలంగా ఇళ్ల నిర్మాణం పనులు జరగకపోవడంతో పునాదుల్లో జిల్లెడు, కంపచెట్లు పెరిగాయి, పూర్తి అయిన ఇళ్లలో ఎవరూ చేరపోవడంతో అక్కడ నిర్మానుష్య వాతావరణం ఉంటోంది.

మరోచోట ఇవ్వండి



ఇంటి వద్ద శ్మశానం ఉంటే ఎలా కాపురాలు ఉంటాం. పునాది, నీటి సంపు, మరుగుదొడ్డి గుంతకోసం రూ.70వేలు ఖర్చు చేశా. ప్రభుత్వం రూ.40వేల బిల్లులు ఇచ్చింది. నిర్మాణం కోసం తోలిన రాళ్లను సమాధుల కోసం రాత్రి సమయంలో ఇళ్లలో ఉండాలంటే భయమేస్తోంది. ఒకరిద్దిరు చేరి రాత్రిల్లు ఉండలేక ఖాళీ చేశారు. నిర్మానుష్యంగా ఉండడంలో అసాంఘిక కార్యకలాపాలకు నిలయమైంది. ఇక్కడ ఉండలేం. రద్దు చేసి మరోచోట స్థలం ఇవ్వండి

-కావేరి, లబ్ధిదారురాలు, గోరంట్ల

ఆసక్తి చూపని లబ్ధిదారులు



ఇళ్లు పూర్తి చేసిన 14 మంది అందులో చేరకపోగా, మిగిలిన లబ్ధిదారులు నిర్మాణం పనులు చేపట్టడానికి ఆసక్తి చూపడంలేదు. పనులు చేపట్టాలని నిత్యం చెబుతున్నాం. మమ్మల్ని వదిలేయండని వారు దండం పెడుతున్నారు. చివరకు వారు ఆ స్థలాలను అమ్మాలని చూస్తున్నా కొనేవారు ఆసక్తి చూపడంలేదు. డంపింగ్ యార్డును మరో చోటికి మార్చి కాలనీని వేరు చేసేలా 8 అడుగుల ఎత్తులో ప్రహరీగోడ నిర్మిస్తు లబ్ధిదారుల్లో మార్పు వచ్చే అవకాశముంది.

-గణేష్, హౌసింగ్ ఏఈ, గోరంట్ల

డంపింగ్ యార్డు మార్పునకు కృషి



శ్మశానవాటిక వద్ద ఉన్న డంపింగ్ యార్డును మార్చేందుకు కృషిచేస్తున్నాం. బూదిలి గ్రామం వద్ద సర్వేనెంబర్ 726లోని 4 ఎకరాలను రెవెన్యూ అధికారులు సూచించారు. అయితే అందుకు రహదారి సౌకర్యం లేక అధికారులతో సంప్రదిస్తున్నాం. ప్రహరీగోడ నిర్మించడానికి పంచాయతీలో నిధులు లేవు. ఉన్న నిధులు తాగునీటి సరఫరా, పైపులైన్ ఏర్పాటు, మోటార్ల మరమ్మతులకు సరిపోతున్నాయి.

-సుబ్రహ్మణ్యం, పంచాయతీ కార్యదర్శి, గోరంట్ల

సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం


జడ్పీహెచ్‌ఎస్‌లో ఆహారాన్ని వడ్డిస్తున్న నిర్వాహకులు

సోమందేపల్లి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా ఒకే మెనూతోపాటు చౌకధాన్య డిపోల ద్వారా రేషన్ బియ్యాన్ని ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా చేసి దాంతో వడ్డించిన ఆహారాన్ని విద్యార్థులకు అందించేవారు. అయితే ప్రస్తుతం పరిస్థితి మారింది. రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకంలో సమూల మార్పులు తీసుకొచ్చింది. మధ్యాహ్న భోజన పథకంపై పలు ఆరోపణలు రావడంతో దీనిపై సమగ్ర సర్వేజరిపి పథకంలో సమూల మార్పులు తీసుకువచ్చింది. ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థికి సన్నబియ్యంతో వండిన ఆహారాన్ని అందించాలని విద్యాశాఖామంత్రి నారాలోకేశ్ ఆదేశాలతో 2025-26కు సంబంధించి పాఠశాల ప్రారంభమైన తొలిరోజు సన్నబియ్యంతో ఆహారాన్ని వడ్డించారు. మెనూలో కూడా ప్రాంతాలవారిగా అక్కడి ఆహారపు అలవాట్లకు అనుకూలంగా పౌష్టికాహారాన్ని మెనూలో ఉంచారు. దీంతో తల్లిదండ్రులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రతిభా పురస్కారాలు ప్రదానం


విద్యార్థులతో మాజీ ఎమ్మెల్యే తదితరులు

మడకశిర టౌన్, జూన్12(ఆంధ్రజ్యోతి): మడకశిర నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలోని ఎస్సీ, ఎస్టీకి చెందిన 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు డీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో గురువారం ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. మాజీ ఎమ్మెల్యే సుధాకర్, డీహెచ్‌పీఎస్ అధ్యక్షులు హనుమంతు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇష్టపడి చదవాలని సూచించారు.

ఏకగ్రీవం..


కవితను అభినందిస్తున్న పంచాయతీ సభ్యులు

పావగడ, జూన్ 12(ఆంధ్రజ్యోతి): పావగడ తాలూకా వళ్లూరు గ్రామ పంచాయతీ అధ్యక్షురాలిగా కవితాబాలప్ప ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతంలో అధ్యక్షుడిగా ఉన్న ముత్యాలప్ప రాజీనామా చేయడంతో గురువారం ఎన్నికలు జరిగాయి. కవిత మాత్రమే నామినేషన్ చేయడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి తహసీల్దార్ వరదరాజు ప్రకటించారు. ఉపాధ్యక్షురాలిగా మంజుళ నాగేష్ ఎంపికయ్యారు.

బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలి

పెనుకొండ, జూన్ 12(ఆంధ్రజ్యోతి): బాల కార్మిక వ్యవస్థను నిర్మూలన చేయాలని సమత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు ఆదినారాయణరెడ్డి పేర్కొన్నారు. గురువారం జాతీయ బాల కార్మికుల నిర్మూలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఉదయం వివిధశాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, పోలీసులు, విద్యార్థుల బ్యానర్లు పట్టుకుని నినాదాలు చేస్తూ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ బాల కార్మికులు, బాల్యవివాహాల నిర్మూలనపై పనిచేస్తున్నామన్నారు.

పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థి కృషి


విద్యార్థులకు స్టీల్‌ప్లేట్లు అందజేస్తున్న ఎంపీడీఓ తదితరులు

గోరంట్ల, జూన్12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల అభివృద్ధి కోసం పూర్వ విద్యార్థి కొండాపురం శివరాం ఫౌండేషన్ చైర్మన్ సోముశేఖర్ ఒకటిన్నర లక్షలతో పలు పనులు నిర్వహించారు. వంటగది ఆధునీకీకరణ, సామగ్రి, ఆర్వోప్లాంటుకు షెడ్ నిర్మాణం తదితర పనులను చేపట్టారు. గురువారం వాటిని ప్రారంభించారు. ఈకార్యక్రమానికి ఎంపీడీఓ నరేంద్రకుమార్, ఎంఈఓ గోపాల్, హెచ్‌ఎంలు మాలతి, మాధవీలత తదితరులు పాల్గొన్నారు. అనంతరం సోముశేఖర్‌ను సత్కరించారు.

చదువుతోనే రాణింపు

హిందూపురం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ఏరంగంలో రాణించాలన్నా చదువు ముఖ్యమని టీడీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట శివశంకర్ అన్నారు. గురువారం కొల్లకుంటలో ప్రభుత్వ పాఠశాలలో చదవుతున్న విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, జామెంట్రిబాక్స్, వాటర్‌క్యాన్‌లు అందజేశారు. కార్యక్రమంలో భవానీ, జనసేన నాయకులు శేఖర్, చెల్లప్ప, రవికుమార్, రాఘవేంద్ర, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వీరజవాన్ కుటుంబానికి రూ.లక్ష అందజేత


నగదును అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే

గోరంట్ల, జూన్12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లితండాకు చెందిన వీరజవాన్ మురళీనాయక్ కుటుంబానికి ఆదోని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి రూ.లక్ష గురువారం అందజేశారు. మాజీ ఎమ్మెల్యే కల్లితండాకు వెళ్లి వీరజవాన్ తల్లిదండ్రులు శ్రీరామనాయక్, జ్యోతిబాయిలను పరామర్శించి నగదు అందజేశారు.

రైతుల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

హిందూపురం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): రైతులు అన్నివిధాలా అభివృద్ధి చెందాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని మార్కెట్‌యార్డ్ చైర్మన్ అశ్వర్థనారాయణరెడ్డి పేర్కొన్నారు. గురువారం హిందూపురం మండలంలోని రైతులకు సబ్సిడీ విత్తన వేరుశనగ కాయలను అందజేశారు. పూలకుంటలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మార్కెట్‌యార్డ్ చైర్మన్ అశ్వర్థనారాయణరెడ్డి ఎమ్మెల్యే పీఏ వీరయ్య మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకోసం అన్నివిధాలా సహకరిస్తుందన్నారు. విత్తన వేరుశనగ నాణ్యతలేకపోతే వెంటనే వ్యవసాయాధికారులకు తెలుపాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆదినారాయణ, ఉమాశంకర్‌రెడ్డి, వెంకటరమణప్ప, పాపన్న, శ్రీనివాసులు, గంగాధర్, ఏఓ సురేంద్రనాయక్, రామక్రిష్ణారెడ్డి, చిక్కీరప్ప, గోపాల్‌రెడ్డి, ఆంజనేయులు పాల్గొన్నారు.
సోమందేపల్లి: సోమందేపల్లిలో విత్తన వేరుశనగ పంపిణీ గురువారం ప్రారంభమైంది. ఏఓ కవితారాణి, ఏఈఓ అలైఖ్య, నాయకులు వెంకటరాముడు, ఆంజనేయులు, కన్వీనర్ వెంకటేశ్, మాజీ కన్వీనర్ సిద్దలింగప్ప, మాగేచెరువు సర్పంచ్ నరసింహులు పాల్గొన్నారు.


హిందూపురంలో వేరుశనగ బస్తాలు అందజేస్తున్న నాయకులు

హిందూపురంలో పోలీసుల తనిఖీలు

హిందూపురం, జూన్12(ఆంధ్రజ్యోతి): పట్టణంలో గురువారం హిందూపురం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. పట్టణంలోని ఆబాద్‌పేట ప్రాంతంలో ప్రతి ఇంటినీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రిజిస్ట్రేషన్‌లేని వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో సీఐ రాజగోపాల్, ఎస్ఐ శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో బోల్తా : 8 మందికి గాయాలు

గోరంట్ల, జూన్ 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కదిరి ప్రధాన రహదారిలో ఎములగుట్లపల్లి క్రాస్ రోడ్డు వద్ద ఆటో బోల్తా పడిన సంఘటనలో గురువారం ఎనిమిది మంది మహిళలు గాయపడ్డారు. ఉగ్రారంపల్లి, పెట్లగుట్లపల్లి గ్రామాలకు చెందిన పదిమంది మహిళలు గుంతపల్లి సమీపంలోని ఓ గార్మెంట్స్ పరిశ్రమలో గురువారం విధులు ముగించుకుని ఆటోలో వెళ్తుండగా ఎములగుట్లపల్లి క్రాస్ రోడ్డు వద్ద ఆటో బోల్తాపడింది. ఇందులో ఎనిమిది మందికి గాయాలయ్యాయి. గాయపడినవారిని గోరంట్ల ప్రభుత్వ ఆసుప్రతికి తీసుకురాగా డాక్టర్ ఉషా, వినోద్‌కుమార్ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం 108లో హిందూపురం తరలించారు. పోలీసులు సంఘటనాస్థలాన్నిసందర్శించి, దర్యాప్తు చేస్తున్నారు. మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి గాయపడిన వారిని పరామర్శించారు. టీడీపీ నాయకుడు నిమ్మల శ్రీధర్ తీవ్రంగా గాయపడిన ముగ్గురు మహిళలకు రూ. ఐదువేల వంతున వైద్య చికిత్సల నిమిత్తం ఆర్థికసాయం అందించారు.

రెడ్డప్పశెట్టిపై చర్యలు తీసుకోవాలి: సీపీఐ


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య

చిలమత్తూరు, జూన 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిత్రావతి నదిని కబ్జా చేసి తన అవసరాలకు వాడుకుంటున్న రియల్ ఎస్టేట్ వ్యాపారి రెడ్డప్పశెట్టిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య డిమాండ్ చేశారు. గురువారం ఆయన స్థానిక సీపీఐ నాయకులతో కలిసి కొడికొండ సమీపంలోని రెడ్డప్పశెట్టి ఎస్టేట్‌ని పరిశీలించారు. ఎస్టేట్‌లో రెడ్డిప్పశెట్టి ఆక్రమించుకున్న చిత్రావతి నదీ పరివాహకం, ఏపీఐఐసీకి చెందిన భూములను పరిశీలించారు. నదికి ఆనకట్ట కట్టి తన పొలాల్లో కలుపుకోవడం, నదిలోని నీళ్లను తన పొలాలకు వాడుకోవడం వంటివి చేస్తున్నా అధికారులు మిన్నకుండిపోవడంపై ఆయన అనుమానం వ్యక్తం చేశారు. సహజంగా ఉన్న నదికి ఆనకట్టలు కట్టడం, ప్రభుత్వ భూములను ఆక్రమించుకోవడంపై వెంటనే అతనిపై క్రిమినల్ కేసులు నమోదుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ హిందూపురం కార్యదర్శి వినోద్‌కుమార్, నాయకులు ఇస్మాయిల్, బాబు, మారుతిరెడ్డి, చలపతి, సమీవుల్లా తదితరలు పాల్గొన్నారు.

టీబీ నిర్మూలనపై అవగాహన

పెనుకొండ, జూన్ 12(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి టీబీ యూనిట్ ఆధ్వర్యంలో గురువారం వెంకటరెడ్డిపల్లిలో డాక్టర్ ఉదయ్‌కిరణ్ ఆధ్వర్యంలో టీబీ వ్యాధి గురించి అవగాహన కల్పించారు. రెండు వారాలుగా దగ్గు, తగ్గినప్పుడు గళ్ల, రక్తం పడటం, బరువుతగ్గడం, ఆకలి తగ్గడం, తరచూ జ్వరం రావడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో పెనుకొండ యూనిట్ సిబ్బంది, ఎస్‌టిఎస్ డబ్ల్యుఎస్ శశిధర్, టీబీహెచ్‌వి రెడ్డమ్మ, ఎంపీహెచ్ఈఓ వెంకటేశ్వర్‌రావు, ఎంపీహెచ్‌ఎ జనార్దన్, ఎఎన్‌ఎం హేమలత, ఎంఎల్‌హెచ్‌పి పుణ్యవతి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంఖ్య పెంచాలి: సీఐటీయూ

పెనుకొండ, జూన్ 12(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీలో జనాభాకు అనుగుణంగా పారిశుధ్య కార్మికులను పెంచాలని సీఐటీయూ ఆధ్వర్యంలో కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, వెంకటేశ్, సీఐటీయూ కన్వీనర్ బాబావలి జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు వెంకటేశ్, గంగాధర్, తిప్పన్న, నరసింహులు, ఆనందయ్య, వెంకటేశ్, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

సెరికల్చర్ అధికారి బదిలీ

రొద్దం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): రొద్దంలో సెరికల్చర్ అధికారిగా పని చేసే రాజేశ్వరి ధర్మవరానికి బదిలీపై వెళ్లారు. అనంతపురం నుంచి సిరికల్చర్ అధికారి ఓబిలేశు రొద్దంకు బదిలీపై వచ్చారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, జూన్12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మసీదు సర్కిల్‌లో నివాసముంటున్న వివాహిత మంజుల గురువారం ఆత్మహత్యకు యత్నించింది. గజేంద్ర భార్య మంజుల భర్త ఇంటిలో లేని సమయంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. చుట్టుపక్కల వారు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా డాక్టర్ వినోద్‌కుమార్ చికిత్సలు చేసి, మెరుగైన వైద్యం కోసం హిందూపురం తరలించారు.

సంస్కారంతో కూడిన విద్యతోనే దేశ ప్రగతి

పావగడ, జూన్ 12(ఆంధ్రజ్యోతి): చిన్నతనంలో తమ పిల్లలకు సంస్కారవంతమైన విద్య అందిస్తేనే భవిష్యత్తులో ఉన్నత పౌరులుగా ఎదిగి దేశ ప్రగతికి బాటలు వేస్తారని నిడుగల్ దుర్గం వాల్మీకి పీఠాధిపతి సంజయ్ కుమార్ స్వామీజీ పేర్కొన్నారు. గురువారం పోతగానిహళ్లి గ్రామంలో వాల్మీకి విగ్రహ ఆవిష్కరణ అనంతరం మాట్లాడారు. నేటి నేటి ఆధునిక యుగంలో మానవ సంబంధాలు అంతరించిపోతున్నాయని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో పాలేగార్ లోకేష్, మధుసూదన్, చిన్నభయ్యా, శ్రీనివాస్, పుష్పవతి, శివన్న పాల్గొన్నారు.